SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 348 | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | గురువారం 19-02-2026

## రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!



❄నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా శనగల కొనుగోళ్ల ప్రారంభం

❄94,500 మెట్రిక్ టన్నుల శనగల సేకరణకు నిర్ణయం

❄రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ

❄కొనుగోలు చేసిన 15 రోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. మిగతా 2లో

## ముక్కుపచ్చలారని పసిబిడ్డపై గంజాయి మత్తులో జరిగిన పైశాచికం ఇది



⌘మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం

⌘గంజాయి మత్తులోనే ఈ దారుణం జరిగిందని ఆరోపణ

⌘డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ

⌘గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్

⌘బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి

మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మిగతా 2లో

## నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని..

# నీవేమైనా ఇచ్చావా జగన్?

**బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు: నారా లోకేశ్**

**పుష్ప స్టైల్లో ఎక్స్ వేదికగా వైసీపీకి మంత్రి కౌంటర్**

**"ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే!**

**నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?"**

**ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి"**

కొలంబోలో జరిగిన భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ కు హాజరైన మంత్రి

ప్రభుత్వ సొమ్ముతో కొలంబో వెళ్లారన్న ప్రచారాన్ని ఖండించిన లోకేశ్

తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంపై మండలిలో చర్చకు పట్టుబట్టిన వైసీపీ

కొలంబోలో భారత్ - పాక్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ కు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరైన విషయం తెలిసిందే. అయితే, ఈ పర్యటనకు మంత్రి లోకేశ్ ప్రభుత్వ నిధులు వాడారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

ఈ ఆరోపణలపై మంత్రి సెటైర్ వేశారు.

పుష్ప సినిమా స్టైల్లో జవాబిచ్చారు.

భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌కు తాను ప్రభుత్వ ఖర్చుతో వెళ్లలేదని, సొంత డబ్బులతోనే వెళ్లానని స్పష్టం చేస్తూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

వైసీపీ అనుకూల మీడియాలో వస్తున్న వార్తలను ఖండిస్తూ లోకేశ్ 'ఎక్స్' వేదికగా ఘాటు రిప్లై ఇచ్చారు."ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

ప్రభుత్వ సొమ్ముతో విదేశీ ప్రయాణాలు చేశానన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.



కొలంబోలో భారత్ - పాక్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ కు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరైన విషయం తెలిసిందే. అయితే, ఈ పర్యటనకు మంత్రి లోకేశ్ ప్రభుత్వ నిధులు వాడారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలపై మిగతా 2లో

## ఇందాపూర్ డెయిరీతో

# హెరిటేజ్ చీకటి ఒప్పందం

**మేం కూడా లడ్డూపై చర్చిద్దామనే కోరుతున్నాం**

తిరుమల లడ్డూపై శాసనమండలిలో చర్చించాలన్న బొత్స సత్యనారాయణ

ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే అని డిమాండ్

వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలన్న బొత్స

ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు. మిగతా 2లో

## చైనా రోబోను మనదిగా చూపించి అవమానించారు..



చైనా మీడియా ఎగతాళి చేస్తోంది

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గల్గోటియాస్ వర్సిటీ స్టాల్ ఏర్పాటు

చైనా అభివృద్ధి చేసిన రోబోను తమదిగా పేర్కొంటూ స్టాల్‌లో ప్రదర్శన

కేంద్రం పీఆర్ స్టంట్స్ చేస్తోందని రాహుల్ గాంధీ ఆగ్రహం

చైనా అభివృద్ధి చేసిన రోబోను మనదిగా చూపించారని ఆగ్రహం మిగతా 2లో

## సాక్షిలో రాసే విషయాలనే

# వైసీపీ నేతలు మాట్లాడుతుంటారు

**గంజాయికి అలవాటు పడే కులవర్ధన్ ఈ ఘాతుకం**

కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి: అనిత

రసాయనాలతో నెయ్యి తయారు చేశారని సిట్ రిపోర్ట్ ఇచ్చిందన్న అనిత

పింక్ డైమండ్ పేరుతో గతంలో సభా సమయం వృథా చేశారని మండిపాటు



తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ మిగతా 2లో

## రాహుల్ గాంధీ దేశ భద్రతకు అతి ప్రమాదకరం



కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేశారు.

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ANIతో మాట్లాడిన రిజిజు, మిగతా 2లో

## భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది




భారత్‌తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చిన సుందర్ పిచాయ్

భారత్ లో జరుగుతున్న ఏఐ సమ్మిట్ కోసం విచ్చేసిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ భారత్ లో జరుగుతున్న మిగతా 2లో

## ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదు



ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్నవారికైనా తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చని హెచ్చరిక

అమెరికా - ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో మిగతా 2లో

## అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయ్.. విద్యార్థులతో అయ్యన్న మాటామంతి



▶▶అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి విద్యార్థులు వచ్చారు.

▶▶ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు.

▶▶అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు.

అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల మిగతా 2లో

## చంద్రబాబు గారూ

# ఇకనైనా మేలుకోండి

**తలశిల రఘురామ్ తండ్రి కన్నుమూత**

**గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వెళ్లిన జగన్**

**చంద్రశేఖరరావు భౌతికకాయానికి నివాళి అర్పించిన వైసీపీ అధినేత**

**చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోంది**

గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వెళ్లిన జగన్

చంద్రశేఖరరావు భౌతికకాయానికి నివాళి అర్పించిన వైసీపీ అధినేత

వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ను ఆ పార్టీ అధినేత జగన్ పరామర్శించారు.

ఈ ఉదయం తలశిల రఘురామ్ తండ్రి చంద్రశేఖరరావు కన్నుమూశారు.

ఈ నేపథ్యంలో విజయవాడ గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి జగన్ వెళ్లారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం నీరుగట్టువారిపల్లిలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచార ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది.

మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చినా పోలీసులు ఆ చిన్నారిని ఎందుకు కాపాడలేకపోయారు? అని ప్రశ్నించారు.

"నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల గిరిజన బాలికపై అత్యాచారం, ఆపై హత్య.వైయస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలంలోని ఏ.కంబాలదిన్నెలో మూడేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం.

మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చినా పోలీసులు ఆ చిన్నారిని ఎందుకు కాపాడలేకపోయారు? అని ప్రశ్నించారు.

వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ను ఆ పార్టీ అధినేత జగన్ పరామర్శించారు. ఈ ఉదయం తలశిల రఘురామ్ తండ్రి చంద్రశేఖరరావు కన్నుమూశారు. ఈ నేపథ్యంలో విజయవాడ మిగతా 2లో

రాష్ట్రంలో బాలికలపై వరుసగా హత్యాచారాలు జరుగుతుంటే.. చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నీరుగట్టువారిపల్లి ఘటన ప్రభుత్వానికి సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చినా పోలీసులు ఆ చిన్నారిని ఎందుకు కాపాడలేకపోయారు?



## 'టీటీడీని ఎవరూ ప్రశ్నించలేదు.. టీడీపీని మాత్రమే ప్రశ్నించాం'



❖టీటీడీని ఎవరు ప్రశ్నించలేదు.. టీడీపీని మాత్రమే ప్రశ్నిస్తున్నామని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

❖బుధవారం తిరుపతి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇందాపూర్ డైయిరీ వ్యవహారంపై ఆయన మీడియాతో మాట్లాడారు.

❖ నెయ్యి సరఫరాకి నందిని డెయిరీకి సింగిల్ టెండర్‌కే ఇచ్చారు. ఇందాపూర్ డెయిరీకి L3 టెండర్‌కే ఇచ్చారు.

## రాహుల్ గాంధీ దేశ భద్రతకు అతి ప్రమాదకరం

రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఆయన దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా మారారని మండిపడ్డారు. ఆయన దేశంలోనూ విదేశాల్లోనూ నక్సల్స్, తీవ్రవాదులు, కొందరు భావజాలవేత్తలు, జార్జ్ సోరోస్ వంటి వ్యక్తులను కలుస్తున్నారని ఆరోపించారు. రిజిజు ప్రకారం, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల సమయంలో జార్జ్ సోరోస్ వంటి వ్యక్తులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇలాంటి సంబంధాలు దేశ భద్రతకు దెబ్బతీసేలా ఉన్నాయని, రాహుల్ భారత వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యకలాపాలు దేశాన్ని బలహీనపరచే ప్రయత్నాలుగా భావిస్తున్నట్లు రిజిజు స్పష్టం చేశారు.ఈ ఆరోపణలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. రాహుల్ గాంధీపై లోక్‌సభలో ఒక తీర్మానం కూడా ప్రవేశపెట్టేందుకు రిజిజు పేర్కొన్నారు. దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని, భారత వ్యతిరేక శక్తుల సహాయంతో పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇది ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మరింత వర్గవిభజనంగా మారింది.ఈ సంఘటన బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అంశంగా కనిపిస్తోంది. రాహుల్ గాంధీపై ఇలాంటి ఆరోపణలు గతంలో కూడా వచ్చినప్పటికీ, ఇప్పుడు నక్సలైట్లు, సోరోస్ వంటి నిర్దిష్ట పేర్లతో రిజిజు చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి.

## భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది

అంతర్జాతీయ ఏఐ సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏఐ సమ్మిట్ సందర్భంగా మన జాతీయ మీడియాతో ఆయన కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడుతూ... భారత్ తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నేను నమ్ముతున్నాను. అందుకే ఇండియాతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నాం.భారత్ లో మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో పరిశోధనలు, యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంపై గూగుల్ దృష్టి సారిస్తోంది.భారత్ లో ఫుల్ రీజియన్ స్థాపన కోసం రిలయన్స్ జియోతో కలిసి పనిచేస్తున్నాం. రాజస్థాన్ లో 150 మెగావాట్ల పునరుత్పాదక ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం.అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థల భాగస్వామ్యంతో డేటా సెంటర్ల విస్తరణ జరుగుతోంది. భారత వినియోగదారుల కోసం ఏఐ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం.భారత మీడియాతో ఈ మేరకు అమెరికా నుంచి వర్చువల్ గా మాట్లాడిన పిచాయ్... నేడు భారత్ కు చేరుకున్నారు. ఏఐ సదస్సు కోసం భారత్ కు తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఏఐ సమ్మిట్ లో ఆయన ప్రసంగించనున్నారు.

## ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదు

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదని, భవిష్యత్తులోనూ సాధించలేదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్నవారికైనా తీవ్ర ఎదురుదెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అదే సమయంలో జెనీవా వేదికగా ఇరాన్ - అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు కొనసాగుతుండటం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఖమేనీ చేసిన వరుస ట్వీట్లలో .. తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. కానీ, కొన్ని సందర్భాల్లో అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశమూ ఉంది.

## రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు.కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## ముక్కుపచ్చలారని పసిబిడ్డపై గంజాయి మత్తులో జరిగిన పైశాచికం ఇది

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు.బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయ్.. విద్యార్థులతో అయ్యన్న మాటామంతి

అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. చర్చలు బాగా జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. సీఎం చంద్రబాబును చూడాలని ఉందని చెప్పారు విద్యార్థులు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడికి వెళ్లారని చెప్పారు అధికారులు. అసెంబ్లీ సమావేశాలు చూసిన పలువురు విద్యార్థులు తమకు పోలవరం ప్రాజెక్టు కూడా చూడాలని ఉందన్నారు. ఈసారి నుంచి విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టుని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాటిచ్చారు. తమకు అసెంబ్లీ సమావేశాలు నేరుగా చూడటం కొత్త అనుభూతి కలిగిందని విద్యార్థులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ... సాఫ్ట్ వేర్ సమస్యే దీనికి కారణమని చెప్పారు. టెక్నికల్ సమస్య వచ్చినప్పుడు ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. వైసీపీ వాళు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని... గతంలో ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని... ఇప్పుడు వైసీపీ వాళ్లు వెనక నుంచి గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సభకు హాజరుకాని వైసీపీ సభ్యుల గురించి మాట్లాడుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత విధులను సక్రమంగా నిర్వహించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని అన్నారు. సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు జీతం కట్ చేస్తారని... ఆ నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని... మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు.డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని స్పీకర్ తెలిపారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాదు... సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా ఈ వ్యవస్థ ద్వారా నమోదవుతోందని తెలిపారు.

## ‘టీటీడీని ఎవరూ ప్రశ్నించలేదు.. టీడీపీని మాత్రమే ప్రశ్నించాం’

టీటీడీని ఎవరు ప్రశ్నించలేదు.. టీడీపీని మాత్రమే ప్రశ్నిస్తున్నామని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇందాపూర్ డైయిరీ వ్యవహారంపై ఆయన మీడియాతో మాట్లాడారు. నెయ్యి సరఫరాకి నందిని డెయిరీకి సింగిల్ టెండర్‌కే ఇచ్చారు. ఇందాపూర్ డెయిరీకి ఎల్3 టెండర్‌కే ఇచ్చారు. మదర్ డెయిరీ,ఇందాపూర్ డెయిరీ 130కోట్లకు టెండర్ దక్కించుకుంది. నిబంధనలు కఠిన తరం చేశామని టీటీడీ చెబుతోంది. 1500కిలోమీటర్ల నిబంధన 800కి కుదించారు. మేం పెట్టిన నిబంధనలనే ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా కొనసాగించింది. అయితే, నిబంధనలు తుంగలో తొక్కి 900 కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఇందాపూర్ డెయిరీకి టెండర్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. గుమ్మడికాయల దొంగ ఎవరంటే.. తడుముకున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

# నా దుడ్లతోనే మ్యాచ్ చూస్తిని.. నీవేమైనా ఇచ్చావా జగన్?

మంత్రి సెటైర్ వేశారు. పుష్ప సినిమా స్టైల్లో జవాబిచ్చారు.భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌కు తాను ప్రభుత్వ ఖర్చుతో వెళ్లలేదని, సొంత డబ్బులతోనే వెళ్లానని స్పష్టం చేస్తూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వైసీపీ అనుకూల మీడియాలో వస్తున్న వార్తలను ఖండిస్తూ లోకేశ్ ‘ఎక్స్’ వేదికగా ఘాటు రిప్లై ఇచ్చారు."ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ సొమ్ముతో విదేశీ ప్రయాణాలు చేశానన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల నెయ్యి కల్తీ వ్యవహారంపై చర్చకు వైసీపీ మళ్లీ పట్టుబడుతోంది. నిన్న ఈ విషయమై వైసీపీ తీర్మానం ఇవ్వగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. నేడు కూడా అదే సీన్ రిపీట్ అయింది. ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చకు తీర్మానాన్ని ఇవ్వగా మోషేన్ రాజు డిస్మిస్ చేశారు.దీంతో మండలి విపక్ష నేత, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "టీటీడీలో ఇందాపూర్, హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చించాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీలో ఈ వ్యవహారంపై చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. అందుకే మండలిలో చర్చకు మేము డిమాండ్ చేస్తున్నాం" అన్నారు.బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ లాబీలో నిర్వహించిన చిట్ చాట్‌లో స్పందించారు. "శాసనమండలిలో ఉన్న వైసీపీ సభ్యులపై బొత్స సత్యనారాయణ పట్టు కోల్పోయారు. వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు వేర్వేరుగా వాయిదా తీర్మానాలు ఇచ్చారు. ఒకరు లడ్డూ కల్తీపై చర్చించాలని, మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చించాలని అడిగారు. ఈ ఇద్దరు ఎమ్మెల్సీల్లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి" అని వ్యాఖ్యానించారు.సంపద లేదా హోదా వల్ల కాకుండా, జీవితానికి మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందించడం వల్లే వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. లాభాపేక్షతో కాకుండా మానవత్వంతో సేవలందించాలని, రోగుల నమ్మకాన్ని కూడా తమ విధి నిర్వహణలో భాగంగా మార్చుకోవాలని ఆయన యువ వైద్యులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ప్రతి ఆసుపత్రి ఆవరణలో ఆందోళన, భయం, బాధ ఉంటాయి. అత్యవసర వార్డులోకి వచ్చే రోగి మీ కళ్లలోకి ఎంతో ఆర్తిగా చూస్తాడు. వారు మీ నుంచి కేవలం మందులనే కాదు, నమ్మకాన్ని, భరోసాను ఆశిస్తారు. మీరు ఇచ్చేది కేవలం ప్రిస్క్రిప్షన్ కాదు, వారిలో చిగురింపజేసే ఆశ. కోవిడ్-19 సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైతే, ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు సేవలందించారు. అందుకే సమాజం మిమ్మల్ని దేవుడి తర్వాత అంతటి వారిగా చూస్తుంది" అని అన్నారు.ఈ స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక కాదని, విద్యార్థులుగా ప్రవేశించి జీవన సంరక్షకులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న పరివర్తన అని లోకేశ్ అభివర్ణించారు. "ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దే జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ఎయిమ్స్ భావించబడుతోంది. 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైన మంగళగిరి ఎయిమ్స్, నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులతో 1,300 మందికి పైగా విద్యార్థులతో ఒక సమగ్ర సంస్థగా ఎదిగింది. కొన్ని పడకల నుంచి నేడు దాదాపు 650 పడకలకు విస్తరించింది. ఓపెన్-హార్ట్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి, రోబోటిక్ మోకాళ్ల మార్పిడి వంటి అధునాతన సేవలను అందిస్తోంది. ఈ సంస్థ బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. వీటికి ‘నమ్మకం’ అనే నాలుగో స్తంభాన్ని కూడా మీరు జోడించాలి" అని ఆయన సూచించారు.యువ వైద్యులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "మీరే ఈ దేశపు నిజమైన హీరోలు. సాంకేతికత ఎంత మారినా, కృత్రిమ మేధస్సు (ఏఐ) మీ నైపుణ్యానికి సహాయ పడినా.. వైద్యుడి స్పర్శలోని స్వస్థత శక్తికి సాటిలేదు. ఒక్కోసారి మందుల కన్నా మీరిచ్చే భరోసాయే రోగాన్ని నయం చేస్తుంది. డబ్బు చెల్లించలేని రోగిని ఎలా చూస్తారు, నిరక్షరాస్యులకు ఎలా వివరిస్తారనే దానిపై మీ మానవత్వం ఆధారపడి ఉంటుంది".

# చంద్రబాబు గారూ ఇకనైనా మేలుకోండి

గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి జగన్ వెళ్లారు. చంద్రశేఖరరావు భౌతికకాయానికి ఆయన నివాళి అర్పించారు. అనంతరం రఘురామ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగన్ తో పాటు జోగి రమేశ్, దేవినేని అవినాశ్, విడదల రజని, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం నీరుగట్టువారిపల్లిలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచార ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపింది. దీనిపై వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.రాష్ట్రంలో బాలికలపై వరుసగా హత్యాచారాలు జరుగుతుంటే.. చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నీరుగట్టువారిపల్లి ఘటన ప్రభుత్వానికి సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చినా పోలీసులు ఆ చిన్నారిని ఎందుకు కాపాడలేకపోయారు? అని ప్రశ్నించారు."నంద్యాల జిల్లా పగిద్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల గిరిజన బాలికపై అత్యాచారం, ఆపై హత్య.వైయస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలంలోని ఏ.కంబాలదిన్నెలో మూడేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం. ఆపై హత్య.తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడున్నరేళ్ల చిన్నారిపై యువకుడు అత్యాచారం. ఆపై హత్య."చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఉన్న బాలికలు, మహిళలపై ఇలాంటి దారుణాలు ఎన్నో జరిగాయని, అయినా చర్యలు చేపట్టకుండా తేలికగా తీసుకుంటున్నారని యద్దేవా చేశారు. ఎల్లోమీడియాను వాడుకుని హడావిడి ప్రకటనలు చేయడం ఆ తర్వాత ఆ విషయాన్ని వదిలేయడం షరా మామూలైపోయిందని విమర్శించారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారు మాజీ మంత్రులు అయిన వారి ఇళ్లమీద పోలీసులను వాడుకుని ఒక వ్యూహంతో దాడులు చేయించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, వారిపై హత్యాయత్నాలు చేయించడంపై మీకు ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంపై లేదని మండిపడ్డారు."మీ ప్రభుత్వంలో హోంమంత్రిగారు లా అండ్ ఆర్డర్‌కు బాధ్యత వహించరు. మీ కుమారుడు ఆయన శాఖలను నీరుగారుస్తూ, అందరి శాఖల్లో వేలుపెడతాడు. ఏ మంత్రీ దేనికీ బాధ్యత వహించరు. ముఖ్యమంత్రిగా మీకు ప్రచారం తప్ప మరేమీ పట్టదు. ప్రభుత్వంలో ఉన్నవారికి ఇప్పుడు ఒకటే పని.. సొంత జేబులు నింపుకోవడం, పబ్లిసిటీ చేసుకోవడమే. మరి ఇలాంటి దారుణాలపై ఎవరు దృష్టిపెడతారు మీరు సృష్టించిన పొలిటికల్ గవర్నెన్స్‌తో, రెడ్‌బుక్ రాజ్యాంగంతో పోలీసు సహా వ్యవస్థలను కలుషితం చేస్తే ఇక లా అండ్ ఆర్డర్ ఎలా ఉంటుంది? ఎలా బతుకుతుంది? చిన్నారులకు, మహిళలకు రక్షణ ఎక్కడ నుంచి లభిస్తుంది? మీ పాలనా వైఫల్యాలకు, అసమర్థతకు అభం శుభం తెలియని బాలికలు, మహిళలు బలైపోవాలా? ప్రతిరోజూ భయంతో బతకాలా?పైగా అన్యాయం జరిగిందని ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే, బాధితులపైనే ఎదురుకేసులు పెట్టి, అన్యాయంగా జైళ్లకు పంపుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం రంగాపురంలో ఒక టీడీపీ నాయకడు మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేస్తే, కేసు కట్టి, అరెస్టు చేయాల్సిన పోలీసులు, 3 రోజులు స్టేషన్ చుట్టూ తిప్పి, చివరకు టీడీపీ నేతల ఒత్తిడితో తమపైనే హత్యాయత్నం కేసు పెట్టి, జైళ్లకు పంపారని ఆ బాలిక కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మరి ఇక రాష్ట్రంలో ఎవరికి న్యాయం జరుగుతుంది? చంద్రబాబుగారూ ఇకనైనా మేలుకోండి.., తక్షణం లా అండ్ ఆర్డర్‌పైన, మహిళలకు చిన్నారులకు రక్షణ కల్పించడంపైన, వారి ప్రాణాలు కాపాడడంపైన దృష్టిపెట్టండి." అని జగన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.పోలీసులు కూడా అధికార పార్టీకి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకున్నందుకు దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. "జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదు" అని ఆయన మండిపడ్డారు.

# ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్ చీకటి ఒప్పందం

మండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారం చేస్తున్నారని, సీబీఐ దర్యాప్తులో ఎలాంటి కొవ్వు లేదని తేలిందని ఆయన అన్నారు."ఇందాపూర్ ద్వారా దోచుకోవాలనేది చంద్రబాబు దుర్బుద్ధి. హోంమంత్రి వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారు. మేం కూడా వాస్తవాలు తేల్చాలనే తిరుమల లడ్డూపై మండలిలో చర్చిద్దామని కోరుతున్నాం. ఇందాపూర్‌తో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం చేసుకుంది. సభలో బడ్జెట్‌తో పాటు ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే" అని బొత్స అన్నారు.తాము చెబుతున్న దాంట్లో అవాస్తవాలు ఉంటే వాస్తవాలను తేల్చడానికి చర్చకు రావాలని బొత్స సవాల్ విసిరారు. ఆధారాలతో సహా తాము నిరూపిస్తామని చెప్పారు. రూ.320కి కొనుగోలు చేసే నెయ్యిని రూ.700కి పెంచడం వెనుక ఉన్న కారణం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని అన్నారు. వీళ్లు చేస్తున్న దోపిడీని బీజేపీ నేతలు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి అధికారంలో ఉండే నైతికత లేదని అన్నారు. గతంలో తిరుమల లడ్డూ ఇస్తే భక్తులు కళ్లకు అద్దుకుని తినేవారని, ఇప్పుడు లడ్డూ ఇస్తే పరిశీలించి చూసి తింటున్నారని బొత్స చెప్పారు. మంత్రి నారా లోకేశ్ తెలిసీ తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము పట్టుకోల్పోయామనే భావనలో ఆయన ఉంటే ఉండనివ్వాలని... తమకు ఎలాంటి నష్టం లేదని అన్నారు.జంతువుల కొవ్వు కలిసిందని దేవదేవుడి ప్రసాదంపై అసత్యాలు ప్రచారం చేశారని.. ఎలాంటి కొవ్వు లేదని సీబిఐ తేల్చిందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ... ఇందాపూర్ ద్వారా దోచుకోవాలని చంద్రబాబు దుర్బుద్ధి అంటూ దుయ్యబట్టారు. హోంమంత్రి వచ్చి ఏదోదో మాట్లాడుతున్నారు. మేం కూడా వాస్తవాలు తేల్చాలనే సభలో చర్చించమని కోరుతున్నామని బొత్స అన్నారు."సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక డొల్ల బడ్జెట్ పెట్టారు. హెరిటేజ్ సంస్థ ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం చేసుకుంది. దోచుకోవడమే హెరిటేజ్ ఆలోచన. ఎందుకు సభలో చర్చించడానికి ఈ ప్రభుత్వానికి భయం. సభలో బడ్జెట్‌తో పాటు ఇందాపూర్, హెరిటేజ్‌పై చర్చించాల్సిందే. ఏ వర్గం అవసరాలు తీర్చలేని బడ్జెట్ ఇది. మేం చర్చించాలని కోరితే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. మేం చెప్పిన దాంట్లో అవాస్తవాలుంటే వాస్తవాలు తేల్చడానికి చర్చకు రండి. మేం ఆధారాలతో సహా నిరూపిస్తాం" అంటూ బొత్స సవాల్ విసిరారు."వివరణలు ఇచ్చే బదులు చర్చకు రావొచ్చు కదా. దోచుకోవడమే మీ ఏకైక లక్ష్యం. 320కి కొనుగోలు చేసే నెయ్యి 700 కి పెంచడం వెనుక కారణం తెలియాలి. పాల రేటు అప్పట్లో తక్కువ ఇప్పుడు పెరిగిందంటున్నారు. ఏ సంవత్సరంలో పాల రేటు ఎంతో చర్చపెట్టండి. టీడీపీ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయి. చంద్రబాబు, పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలి. ఈ దోపిడీని బీజేపీ నేతలు సమర్థిస్తారా?. చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ఒక్కరోజు కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదు. రేపటిరోజైనా చర్చించేందుకు రండి..రైతులు గిట్టుబాటు ధరల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

# సాక్షిలో రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారు

కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు. చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు.దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్ రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని అనిత దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో యాడ్స్ రూపంలో సాక్షికి రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారుగంజాయి కి అలవాటుపడి కులవర్ధన్ బాలికపై ఘాతుకానికి పాల్పడ్డారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు.మదనపల్లి ఘటనపై ఆమె స్పందించారు. బాలికపై పాల్పడిన దారుణానికి కులవర్ధన్ మనస్థాపం చెందారని, అందుకే ఆత్మహత్య చేసుకున్నారని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. మదనపల్లె మండల నీరుగట్టు వారపల్లిలో హత్యాచారణాకి గురైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు కీలక నిందితుడు కురవర్ధన్ చెరువులో దూకి ఆత్మహత్ చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్ కు తీసుకెళ్తున్న సమయంలో తప్పించుకున్నారు. అనంతరం చెరువులో మృతదేహం లభ్యమైంది. అయితే బాలికపై అత్యాచారం చేసి హత్య చేశారు. మృతదేహాన్ని తన ఇంట్లోని నీళ్ల డబ్బులో ఉంచారు. అనంతరం ఇంటి గడి పెట్టుకుని నిందితుడు అలానే ఉండిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిందితుడి ఇంటిపై బాలిక కుటుంబసభ్యులు దాడి చేసే ప్రయత్నం చేశారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా నిందితుడు తప్పించుకుని ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు హోంమంత్రి అనిత స్పందించారు.ఎలా ఉంటుందో చూపిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాబోయే పదేళ్లలో నల్గొండను ఒక పెద్ద ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో శాంతి సామరస్యాలు నెలకొల్పడమే తన లక్ష్యమని, గంజాయి, రౌడీయిజం వంటి అసాంఘిక కార్యకలా పాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని అన్నారు. నల్లగొండలో రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి కొమటిరెడ్డి తెలిపారు. లతీఫ్ సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టల కు ఘాట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని స్పష్టం చేశారు. పట్టణం లో లో-వోల్టేజ్ సమస్య లేకుండా 8 సబ్ స్టేషన్ల నిర్మాణం, పాత లైన్ల మార్పిడి జరుగుతోందని పేర్కొన్నారు. 24 గంటల పాటు నీటి సరఫరా అందించేలా కొత్త ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ‘బొట్టు గూడా’పాఠశాల తరహాలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.20 కోట్లతో న్యాక్ (చౌజ) భవనం, రూ.84 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రం పనులు పూర్తయ్యాయని మంత్రి వివరించారు.పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు తమ డివిజన్ల సమస్యలను పరిష్కరించాలని, తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా పనులే ముఖ్యమని భావించి పనిచేయాలని ఆయన సూచించారు. పట్టణంలోని పద్మావతి కాలనీలో రూ.80 లక్షల వ్యయంతో, శివాజీ నగర్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న పార్కు పనులకు మంత్రి భూమి పూజ చేశారు.

# చైనా రోబోను మనదిగా చూపించి అవమానించారు..

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ‘ఏఐ ఇంపాక్ట్’ సదస్సులో గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం చైనా రోబోడాగ్‌ను తాము అభివృద్ధి చేసినట్లుగా పేర్కొంటూ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సదస్సులో నుంచి గల్గోటియాస్ విశ్వవిద్యాలయానికి ఉద్వాసన పలికింది. ఈ వివాదంపై లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సును అధ్వానంగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భారత్ ప్రతిభను ప్రపంచానికి చూపకుండా పీఆర్ స్టంట్ చేస్తున్నారని ఆరోపించారు. భారతీయుల డేటాను అమ్మకానికి పెట్టి చైనా ఉత్పత్తులతో షో చేస్తున్నారని విమర్శించారు. చైనా అభివృద్ధి చేసిన రోబోలను మనవిగా చూపించి అవమానాలకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సమ్మిట్‌ను ఒక జోక్‌గా మార్చారని మండిపడ్డారు. భారతదేశం ప్రతిభను కనబర్చాల్సిన చోట ఈ తీరు దారుణమని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏఐ సదస్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా దేశాన్ని నవ్వులపాలు చేసిందని అన్నారు. చైనా రోబోలను మనవిగా ప్రదర్శించినందుకు ఆ దేశ మీడియా మనల్ని ఎగతాళి చేస్తోందని అన్నారు. ఇది దేశానికి నిజంగా ఇబ్బందికరమైన పరిణామమని అన్నారు.క్యాతనపల్లిలో మంత్రి వివేక్ నేరుగా ఎన్నికల ప్రక్రియను శాసిస్తూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడని కేటీఆర్ అన్నారు.బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక దళిత నాయకుడిని, ముందస్తు నోటీసులు లేకుండా బందిపోట్ల మాదిరిగా అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరికిపంద చర్యకు నిదర్శనం అంటూ మండిపడ్డారు.పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయిందని విమర్శించారు. నిష్పక్షపాతంగా ఉండాల్సిన రిటర్నింగ్ ఆఫీసర్లు, పోలీసులు కాంగ్రెస్ నాయకుల కళ్లసైగలకు తలొగ్గి పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్క సుమన్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలను, కార్యకర్తలను పోలీసులు వేధించడం ఆపాలని కేటీఆర్ అన్నారు. లేదంటే ఇప్పుడు అధికార పార్టీకి, మంత్రికి అడుగులకు మడుగులొత్తుతూ, అక్రమాలకు పాల్పడుతున్న ప్రతి ఒక్క పోలీస్ అధికారి భవిష్యత్తులో తగిన ప్రతిఫలం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.‘ కొంతమంది ఆనవాళ్లు చెరిపేస్తామని మాట్లాడుతున్నారు. జాతి మీద, జాతి గౌరవం మీద ఎవరు పడితే వాళ్లు మాట్లాడుతున్నారు. కానీ కేసీఆర్ ఒక శిఖరం. తెలంగాణనే కేసీఆర్ ఆనవాలు. ఈ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాలు. దాన్ని ఎట్లా చెరిపేస్తావు? తెలంగాణ మట్టితో మమేకమైన వాడికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వాడికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వాళ్లకి మాత్రమే జాతి అంటే ఏంటో, జాతి గౌరవం అంటే ఏంటో తెలుస్తుంది. సకల జనులు స్వరాష్ట్ర సమరంలో తెగించి కొట్లాడుతున్నప్పుడు, ప్రాణాలకు తెగించి మన నాయకుడు నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు, సమైక్యాంధ్ర వాదుల సంచులు మోసిన సన్నాసులకు జాతి తెలవదు, నీతి తెలవదు. ఆ రోజు తుపాకులు తీసుకుని ఉద్యమకారుల మీద దాడికి వెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎట్లా తెలుస్తది? రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే, ఆత్మాభిమానం అనేది ఎక్కడన్నా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏందో, జాతి చరిత్ర అంటే ఏందో తెలుస్తది..’అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ‘కేసీఆర్.. ఏ జాతికి నువ్వు జాతి పిత? ఏ జాతి నీది అని మాట్లాడుతున్నాడు? రాజ్యతంత్రం నడిపిన రాణి రుద్రమ్మ జాతి మాది. జల్, జంగల్, జమీన్ అని కొట్లాడిన కొమురం భీమ్, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క సారలమ్మ, పరాయి పాలనపై పోరాడి తెలంగాణ అస్తిత్వాన్ని నిలిపిన సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, భాగ్యరెడ్డి వర్మ, తుర్రేబాజ్ ఖాన్, కాళోజీ, దాశరథి వంటి మహనీయుల జాతి మాది. 1952లో ‘గైర్ ముల్కీ గో బ్యాక్‘ అని నెత్తుటి త్యాగాలు చేసిన విద్యార్థి అమరవీరుల జాతి మాది. 69లో కర్కశ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాటంలో అసువులు బాసిన 369 మంది యువ కిశోరాల జాతి మాది. మలిదశ ఉద్యమంలో ఢిల్లీ మెడలు వంచిన తెలంగాణ జాతి మాది. మేము మీలా ఢిల్లీకి సలాం కొట్టి బతికే సామంతులం కాదు. మాది సామంతుల జాతి కాదు..స్వతంత్రుల జాతి. గిరి గీసి కొట్లాడే తెగువ ఉన్న కేసీఆర్ జాతి మాది. కేసీఆర్ తాను జాతి పితనని ఎన్నడూ చెప్పుకోలేదు. ప్రజలే ఆయన్నలా పిలుచుకున్నారు. నా తండ్రి తెలంగాణకు హీరో, తెలంగాణ జాతి మొత్తానికి హీరో..’అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.సవాల్ విసిరారు. చర్చా వేదికను ఆయనే నిర్ణయించుకోవచ్చన్నారు. మన రైతులు, డెయిరీ ఉత్ప త్తులకు కేంద్రం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. “వాణిజ్య ఒప్పందాలు మన రైతులకు హాని చేస్తాయన్న కాంగ్రెస్ ఆరోపణలు హాస్యాస్పదం.

# హత్య కేసులో ముద్దాయిల అరెస్టు



**వెల్దుర్తి, ఫిబ్రవరి 18, (సీమకిరణం న్యూస్) :** ఈనెల 12న మాదాపురం గ్రామ సమీపంలోని శివారెడ్డి కోళ్ల ఫారంలో డోన్ పట్టణానికి చెందిన సురేష్ అనుమానాస్పద మృతి చెందిన ఘటన హత్యగా తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా హత్య జరిగినట్లు నిర్ధారణ అయిందని సిఐ యుగంధర్, ఎస్సై నరేష్ తెలిపారు. బుధవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్ లోని ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కేసులో డోన్ పట్టణానికి చెందిన అమ్రేష్ నాయక్, అల్లా బకాష్‌లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నిందితులు రాడ్లు మరియు ఇతర మారు ఆయుధాలతో సురేష్‌పై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. గురువారం వారిని కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. నిందితులపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే డోన్ పట్టణంలో నూర్ భాషా, పట్టా శేఖర్‌ల మధ్య జరిగిన గలాటా పెద్దమనుషుల సమక్షంలో సర్దుబాటు అయ్యింది. ఇరువురు ఒకరి కాళ్లు ఒకరు పట్టుకుని క్షమాపణలు చెప్పుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న సురేష్ వారిని చూసి నవ్వాడని, దానికి కోపగించిన నూర్ భాషా తమ్ముడు అల్లా బకాష్ ప్రతీకారంతో హత్యకు పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు.

# బ్రహ్మగుండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం

హుండీ ఆదాయం రూ. 2.19222 లక్షలు



**వెల్దుర్తి, ఫిబ్రవరి 18, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండల పరిధిలోని బ్రహ్మగుండేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన నాలుగు రోజుల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీని బుధవారం లెక్కించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ హనుమంతరావు, ఈవో ఆంజనేయులు, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు బొమ్మన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో హుండీని తెరిచి నగదు లెక్కింపు చేపట్టారు. అధికారుల వివరాల ప్రకారం ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల హుండీ ద్వారా మొత్తం రూ. 2,19,222 ఆదాయం నమోదైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ. 86,500 మేర అధికమని వారు తెలిపారు. భక్తుల విశ్వాసం, బ్రహ్మోత్సవాల పట్ల పెరిగిన స్పందన కారణంగానే ఈ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు హుండీ ఆదాయాన్ని వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# జనవాసాల్లో పందుల పెంపకం నిషేధం

యుఎల్‌బి మానిటరింగ్ కమిటీలో కమిషనర్ పి.విశ్వనాథ్

శివారు ప్రాంతాలకు తరలింపు తప్పనిసరి

ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపునకు చర్యలు



**కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** నగర పరిధిలో జనవాసాల్లో పందుల పెంపకానికి ఏమాత్రం అనుమతి లేదని, ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా పందులను తప్పనిసరిగా శివారు ప్రాంతాలకు తరలించాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. పందుల పెంపకానికి ప్రత్యామ్నాయంగా శివారు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో యుఎల్‌బి స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవాసాల్లో పందుల పెంపకానికి అవకాశం లేదని తెలిపారు. పందుల పెంపకానికి బస్తాపాడు గ్రామంలో నాలుగు ఎకరాల భూమిని కేటాయించే అంశాన్ని ప్రతిపాదించగా, పెంపకదారులు మరో రెండు ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వాలని కోరిన విషయాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలను నివేదికగా సమర్పించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో చూపిన ప్రదేశాలకు పందులను తరలించడం తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ డి.రవికుమార్, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు రావు, పశుసంవర్ధక శాఖ ఏడి బి.మల్లన్న, డిప్యూటీ డైరెక్టర్ జి.మాధవ్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.విష్ణు ప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే లక్ష్యం

మహిళలపై జరిగే నేరాలు నూతన చట్టాలపై అవగాహన

జొన్నగిరి ఎస్సై మల్లికార్జున



**తుగ్గలి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జొన్నగిరి, ఎర్రగుడి, చెన్నంపల్లి గ్రామలను జొన్నగిరి ఎస్సై మల్లికార్జున సందర్శించారు. ఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రత రక్షణకు అవగాహన కార్యక్రమాలు విద్యార్థునులకు సైబర్ నేరాలు శక్తి యాప్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే వారి భద్రత కోసం డయల్ 100,112, 19 30, వంటి హెల్ప్ లైన్ నంబర్లకు గాని స్థానిక పోలీస్ స్టేషన్లో గాని సమాచారం అందించాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# 351 మంది అక్రిడిటేషన్ల జారీకి కమిటీ ఆమోదం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన తొలి విడత సమావేశం



**అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** జిల్లాలోని ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా రంగంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులు 351మందికి తొలి విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం కమిటీ సమావేశం జరిగింది. కన్వీనర్ ఑ డిఐపిఆర్ఓ తో పాటు కమిటీ సభ్యులైన మీడియా ప్రతినిధులు, అధికారులు, కె. చంద్రరావు, బి. కొండలరావు, వై. నాగేశ్వరరావు, వై. సన్యాశినాయుడు, బి.గోపీనాథ్ రావు, ఎం. వెంకటరావు పట్నాయక్, ఎ. వెంకట అప్పారావు, పి. నాగశ్రీనివాసరావు, ఎస్. ప్రసాద్ బాబు, బి. ఈశ్వరరావు, పి. గిరిబాబు, ఆర్టీసీ డిపిటిఒ వి.ప్రవీణ, డీఎంఅహెచ్వో ఎం.హైమావతి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పి.సుజాత పాల్గొన్నారు.

**జీవో.ఎం.ఎస్. నెం. 84, అందులో పేర్కొన్న నిబంధనలు, జర్నలిస్టుల అర్హతలు తదితర అంశాలపై చర్చించారు.**

ముందుగా కన్వీనర్ ఑ డిఐపిఆర్ఓ ఎస్.వి. రమణ అజెండా అంశాలను కమిటీకి వివరించారు. దరఖాస్తుల పరిశీలన, ఆమోద ప్రక్రియ, ఇతర అంశాలను తెలిపారు. తొలి విడతలో భాగంగా ప్రింట్ ఑ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 402 దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా అందాయని చెప్పారు. ఇదిలా ఉండగా గురువారం జరిగిన సమావేశంలో 389 ప్రతిపాదించగా 351కి కమిటీ ఆమోదం లభించింది. ప్రింట్ మీడియా నుంచి 236, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 115 దరఖాస్తులు అర్హత పొందాయి. వివిధ కారణాల వల్ల 38 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులు, లాయర్ లు,టీచర్లు గా పనిచేసే వారు ఉన్నట్లయితే వారి సమాచారం తెలిపితే వారి అక్రిడిటేషన్ నిలుపుదల చేస్తామన్నారు. పోలీసు కేసులు నమోదై ఉన్న జర్నలిస్టుల విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కు కమిటీ సభ్యులు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

# పొదుపు మహిళలు చైతన్య ప్రతీకలు గా నిలవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** పొదుపు మహిళలు చైతన్య ప్రతీకలు గా నిలవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మండల సమాఖ్య సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమాఖ్య సభ్యులతో సంభాషించారు. సంఘాల మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకొని ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ సూచించారు. మహిళా సంఘాలు కేవలం రుణాలు తీసుకునే వేదికగా కాకుండా, గ్రామాభివృద్ధికి దారితీసే చైతన్య వేదికలుగా మారాలని పేర్కొన్నారు. గ్రామంలోని పొదుపు మహిళలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, సమాజంలో మంచి మార్పుకు కారకులవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాల్లో వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాకుండా గ్రామం, సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చించి, తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, గర్భిణీల ఆరోగ్యం, విద్య ప్రాధాన్యం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేకంగా చర్చిస్తూ గ్రామంలో ఎంతమంది నమోదు అయ్యారో వివరాలు తెలుసుకున్నారు. చదువురాని ప్రతి ఒక్కరూ సాయంత్రం బడికి హాజరై అక్షరాభ్యాసం నేర్చుకోవాలని సూచించారు. చదువు వల్ల వ్యక్తిగత గౌరవం పెరుగుతుందని, మోసాలకు గురికాకుండా జాగ్రత్తపడగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి అక్షరాస్యత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతం కావడంతో ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. రసాయన రహిత వ్యవసాయం ద్వారా ఆరోగ్యం, ఆదాయం రెండూ మెరుగవుతాయని చెప్పారు. కొన్ని ఇళ్లలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడం అభినందనీయం అని, మరిన్ని కుటుంబాలు కూడా వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, ఐరన్ మాత్రల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. గ్రామాభివృద్ధి కోసం మహిళల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, సంఘాల ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావాలని కలెక్టర్ మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి



జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** పదవ తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమని పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం చిన్న టేకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, ముందుగా పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని పరిశీలించారు. వంటగది నిర్వహణ, నిల్వలు, త్రాగునీటి సదుపాయాలపై అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ... విద్యా ప్రగతిపై సమీక్షించారు. ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ను పూర్తిస్థాయిలో అమలు చేసుకుని ప్రతిరోజూ పునశ్చరణ చేయాలని సూచించారు. ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్, సైన్స్ వంటి బలహీన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధ్యాయుల సహకారంతో సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు టైమ్ టేబుల్ రూపొందించుకుని చదువుకు కేటాయించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని, గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయాలని, మోడల్ పరీక్షలను సీరియస్ గా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా ఎదుర్కొనాలని, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మెరుగుపరచడంతో పాటు తల్లిదండ్రులతో సమన్వయం పెంచి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి ఫలితాలు జిల్లాకు గౌరవప్రదంగా ఉండాలని, ప్రతి పాఠశాల మంచి ఫలితాల కోసం కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అసుదుల్లా ఖాన్, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ లోక్ రాజు, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచలారెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పి-4 కార్యక్రమం ద్వారా 50,038 బంగారు కుటుంబాల గుర్తింపు

బంగారు కుటుంబాలు - మార్గదర్శుల మ్యాపింగ్

నెలాఖరు నాటికి పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి






**నంద్యాల ప్రతినిధి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** జిల్లాలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న పి-4 (ప్రభుత్వ--ప్రైవేటు--ప్రజల భాగస్వామ్యం) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో పి-4 కార్యక్రమం పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ కుటుంబమూ పేదరికంతో బాధపడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం చేసి, వారు అందిస్తున్న సహాయ వివరాలను పి--4 పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో పేదరికంతో బాధపడుతున్న 50,038 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. వారికి అవసరమైన ఆర్థిక, సామాజిక, జీవనోపాధి సహాయాన్ని అందించేందుకు తొలి దశలో 4,311 మార్గదర్శులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో 40,837 బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంకా 9,201 బంగారు కుటుంబాలకు మార్గదర్శుల మ్యాపింగ్ పూర్తి కాలేదని, మిగిలిన కుటుంబాలను “స్వర్ణ గ్రామం” పరిధిలో అర్హులైన మార్గదర్శులతో అనుసంధానం చేసి ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా, మొత్తం ఎన్ని బంగారు కుటుంబాలకు ఎన్ని మార్గదర్శులను నియమించారో, అందులో ఎంతమందిని లైసన్ (సమన్వయం) చేశారో పూర్తి వివరాలను సమగ్రంగా నమోదు చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. డేటా నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, పారదర్శకతతో పని చేయాలని హెచ్చరించారు. పి-4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వ--ప్రైవేటు--ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి అవసరమైన చేయూత అందేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృ-శిశు మరణాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోండి




జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల ప్రతినిధి ఫిబ్రవరి 18 (సీమకిరణం న్యూస్) :** జిల్లాలో మాతృ మరియు శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతృ- శిశు మరణాల నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల టంగుటూరు, డబ్ల్యు.కొతపల్లి, యుపిహెచ్‌సి జగజ్జనని నగర్, యుపిహెచ్‌సి అహోబిలం రోడ్ (ఆళ్లగడ్డ), ఎన్.జి.ఓ కాలనీ ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నమోదైన ఐదు శిశు మరణాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును విడివిడిగా పరిశీలించి, కారణాలను విశ్లేషించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ-శిశు సంక్షేమ శాఖలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించి, అవసరమైన పరీక్షలు, పోషకాహారం, వైద్య సేవలను సమయానికి అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. మాతృ-శిశు మరణాలు అత్యంత విషాదకరమైనవే కాకుండా వ్యవస్థలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాయని, ఇకపై నిర్లక్ష్యం ఏ స్థాయిలోనూ సహించేది లేదన్నారు. ప్రతి గర్భిణీ, ప్రతి శిశువు భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం జరిగేలా సమగ్ర పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలు మాతృ-శిశు మరణాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ, వాటిని పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణీలను తొలిదశలోనే నమోదు చేసి, హైరిస్క్ కేసులను గుర్తించి పైస్థాయికి నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండేలా క్షేత్రస్థాయి సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. సేవలందించడంలో ఏ విధమైన నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు అని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్వో డా. శారదాబాయి, ఎంసిహెచ్ నోడల్ అధికారి డా. ప్రసన్నలక్ష్మి, ప్రోగ్రాం అధికారి డా. ఎస్.ఎస్. శ్రీజ, నంద్యాల సర్వజన ఆసుపత్రి గైనకాలజీ విభాగం డా. పి. పద్మజ, శిశువిభాగం డా. రవీంద్రనాథ్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియాకు మళ్లీ సంకెళ్లు




అద్దం అబద్ధం చెప్పదు. నీలోని లోపాలను ఉన్నవి ఉన్నట్టుగా చూపుతుంది. అలా చూపినందుకు అద్దాన్ని బద్దలు చేస్తానంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. అడ్డగోలు హామీలు, తిట్లు, ఒట్లతో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ మాట తప్పడం, మడమ తిప్పడం గమనిస్తున్న ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నారు. ఎగవేతలను ఎండగడుతున్నారు. చేతకాని, చేవలేని పాలనను కడిగిపారేస్తున్నారు. ఇది గిట్టని సర్కారు కేసులు, అరెస్టులతో వేధింపులకు తెగబడింది. అన్నం తింటున్నవారిని అరెస్టు చేసి తీసుకువెళ్లడం, పోలీసు స్టేషన్లలో గంటలకొద్దీ కూర్చోబెట్టడం వంటి చర్యలతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. అయితే హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో ఈ అరాచకాలకు బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. రాజకీయ పోస్టులపై క్రిమినల్ కేసులు పెట్టరాదని హైకోర్టు ప్రభుత్వానికి గడ్డిపెట్టింది. గట్టిగా మందలించింది. ఈ తీర్పుతో నిజానికి ప్రభుత్వానికి జ్ఞానోదయం కావాలి. కానీ, ఇక్కడున్నది కాంగ్రెస్ సర్కారు. ఏకపార్టీ నియంతృత్వం అమల్లో ఉన్న దేశాల్లోనూ సాధ్యం కాని నిరంకుశాధికారం కోరుకోవడం వారి తీరు. కోర్టులు మొట్టికాయలు వేసినా, ప్రజలు ఛీ కొట్టినా జాన్తానై అంటున్నది సర్కారు. దొడ్డిదారిన వేధింపు మార్గాలు వెతుకుతున్నది. సర్కారు నుంచి వెలువడుతున్న సంకేతాలను బట్టి సైబర్ నేరాల నియంత్రణ పేరిట సోషల్ మీడియా వారియర్లపై రౌడీషీట్లు తెరవనున్నట్టు తెలుస్తున్నది. ఎమర్జెన్సీతో చేతులు కాల్చుకుని చెంపలు వేసుకున్న పార్టీకి నిజమైన జ్ఞానోదయం సాధ్యం కాదని గతంలో ఎన్నోసార్లు తేలిపోయింది. ఇప్పుడు మరోసారి అదే జరుగుతున్నది. సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, ఆర్థిక మోసాలు, అలవాటుగా చేసే నేరాలపై హిస్టరీ షీట్, సస్పెక్ట్ షీట్ తెరవాలని డీజీపీ నుంచి అన్ని పోలీసు స్టేషన్లకు ఉత్తర్వులు వెళ్లాయి. కానీ, దీని లక్ష్యం పైకి చెప్తున్నది కానే కాదు. సర్కారును నిలదీసే సామాజిక మాధ్యమాల పోస్టులకు సంకెళ్లు వేయాలనే మోసకారి ఎత్తుగడ తప్ప మరోటి కాదనేది స్పష్టం. ఎన్నికలకు ముందు రొష్టు పోస్టులతో యథేచ్ఛగా బురదజల్లిన పార్టీకి ఇప్పుడు ప్రశ్నించేవారు శత్రువులు కావడం విడ్డూరం.

సోషల్ మీడియా శక్తియుక్తులు అపారంగా విస్తరించిన రోజుల్లో మనం బతుకుతున్నాం. నిన్నకు నిన్న నేపాల్‌లో జరిగిన ప్రజా తిరుగుబాటు మూలంగా అక్కడి ప్రభుత్వమే కుప్పకూలింది. నాయకుల అవినీతి అందుకు మూలకారణమైనా బాంబుకు వత్తిని సమకూర్చింది మాత్రం సోషల్ మీడియా నిషేధమే. అంతకుముందు బంగ్లాదేశ్‌లో ప్రజా తిరుగుబాటును నడిపించింది సోషల్ మీడియానే. ఇంకొంచెం వెనక్కి వెళ్తే శ్రీలంకలో సర్కారును గద్దెదించింది సోషల్ మీడియా చైతన్యమే. చివరకు చైనాను ఉక్కుచట్రంలో బంధించి పరిపాలించే కమ్యూనిస్టు పార్టీ సైతం జడుసుకునేది సోషల్ మీడియాను చూసే. డిజిటల్ జనరేషన్ పవర్ ఏమిటో ప్రపంచానికి తెలిసిపోయింది. కానీ కల్లలతో, కపటనీతితో గద్దెనెక్కిన కాంగ్రెస్ మాత్రం పదేపదే కత్తిగడుతున్నది. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తే అసలే కుతకుత ఉడుకుతున్న ప్రజాగ్రహానికి ఆజ్యం పోసినట్టు అవుతుందని సర్కారు తెలుసుకోవడం మంచిది.

# పాల దిగుబడికి ఆవు మెదడులో ఇంప్లాంట్.. రష్యాలో సంచలన ప్రయోగం



పాడి పరిశ్రమలో విప్లవాత్మక మార్పుల కోసం సరికొత్త అడుగు పాడి పరిశ్రమలో పాల దిగుబడిని పెంచేందుకు రష్యాకు చెందిన 'నీరీ' అనే సాంకేతిక సంస్థ ప్రపంచంలోనే మొదటిసారిగా ఆవు మెదడులో న్యూరో ఇంప్లాంట్లను అమర్చింది. పాల ఉత్పత్తి పెంచేందుకు ఉన్న ఇతర పద్ధతులు ఫలించనప్పుడు, ఇలాంటి విప్లవాత్మక పరిష్కారం దిశగా అడుగులు వేయడం సంచలనం సృష్టిస్తోంది. 'నీరీ' గత నెలలో ఐదు ఆవులకు శస్త్రచికిత్సలు నిర్వహించి వాటి మెదడులో ఈ ప్రత్యేక పరికరాలను అమర్చింది. ఆవుల తల వెనుక ఒక స్టిమ్యులేటర్‌ను, మెదడు లోపలికి చొచ్చుకుపోయేలా కొన్ని ఎలక్ట్రోడ్లను అమర్చారు. ఆకలి, ఒత్తిడి, పునరుత్పత్తి వంటి వాటికి కారణమయ్యే మెదడులోని భాగాలను ఈ పరికరాల ద్వారా విద్యుత్తు ప్రేరణలతో ఉద్దీపన చేయవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆశ్చర్యకరంగా, ఈ ఆవులకు శస్త్రచికిత్స జరిగే సమయంలో స్పృహ ఉండటం గమనార్హం. అయినా అవి ఎటువంటి ప్రతికూల ప్రభావాలు లేకుండానే మళ్లీ పాల ఉత్పత్తి ప్రక్రియలోకి వచ్చేశాయి. అధికారిక డాటా ఇంకా విడుదల కానప్పటికీ, ఈ ఇంప్లాంట్ల వల్ల ఆవుల పాల దిగుబడి మెరుగుపడిందని 'నీరీ' పేర్కొంది. ఈ న్యూరో ఇంప్లాంట్ మెదడు ఉద్దీపన వంటి పూర్తిగా కొత్త విధానాలు, పాడి పరిశ్రమలో గణనీయమైన మార్పు తీసుకొస్తాయని భావిస్తున్నారు.

# చరిత్రను వొడిసిపట్టిన రచయిత!



తెలంగాణ సాహిత్య ప్రపంచం మరో అపూర్వమైన వ్యక్తిత్వాన్ని కోల్పోయింది. ప్రముఖ రచయిత, తెలంగాణవాది, సామాజిక పరిశోధకుడు కొంపల్లి వెంకట్‌గౌడ్ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడవడం తెలంగాణ సాహిత్య, ఉద్యమ, సామాజిక చరిత్రలో తీరని లోటు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కొంపల్లి వెంకట్‌గౌడ్ తన జీవితాన్ని అంకితం చేశారు. తెలంగాణ తత్వం, ఉద్యమ చైతన్యం, సామాజిక బాధ్య త, ప్రజల ఆత్మగౌరవం, బడుగు వర్గాల సమస్యలను ఆయన రచనలు ప్రతిబింబించాయి. ఆయన రచనల్లోని ప్రతి అంశం సమాజంలో పరిపక్వతను తీసుకొచ్చింది. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించింది. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాన్ని, ఆయన అనుభవాలను 'వొడువని ముచ్చట'లో ప్రతిబింబించారు వెంకట్‌గౌడ్. తద్వారా తెలంగాణ ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించి, స్వతంత్ర ఆలోచనాశక్తిని కలిగించి, సామాజిక బాధ్యతను గుర్తుచేశారు. ఈ గ్రంథం విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యమకారులకు మార్గదర్శకంగా నిలిచింది. జయశంకర్ సార్ సూత్రప్రాయ భావాలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన అవిరళ కృషి, ప్రజా సమస్యల పరిష్కారానికి చూపిన శ్రద్ధకు నిదర్శనం ఈ గ్రంథం. రాష్ట్రానికి చెందిన నీటిపారుదలరంగ నిపుణుడు, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.విద్యాసాగర్‌రావు ఆలోచనలను 'నీళ్ల ముచ్చట' పేరిట గ్రంథరూపమిచ్చారు వెంకట్‌గౌడ్. తద్వారా తెలంగాణ చరిత్రలో కొంపల్లి వెంకట్‌గౌడ్ స్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

కొంపల్లి వెంకట్ గౌడ్ విరచిత 'సర్వాయి పాపన్న చరిత్ర' బడుగువర్గాల ఆత్మగౌరవాన్ని, రైతు ఉద్యమాల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. గౌడన్నలకు సంబంధించిన సంఘటనలతో పాటు, తెలంగాణ గ్రామీణ ప్రజల కష్టాలు, సామాజిక అన్యాయాలు, ఉద్యమ చైతన్యాన్ని సాహిత్య రూపంలో తదుపరి తరాలకు అందించారాయన. కొంపల్లి వెంకట్ గౌడ్ రచనలు సాంకేతికంగా, పరిశోధనాత్మకంగా ఉంటాయి. ప్రతీ గ్రంథంలో నిజ జీవిత సంఘటనలకు ఆయన ప్రాధాన్యమిస్తారు. పాఠకులకు తాత్కాలిక వినోదం మాత్రమే కాకుండా ఆలోచనాత్మక తృప్తిని అందిస్తారు. తెలంగాణ ఉద్యమ చైతన్యం, ప్రజల ఆత్మగౌరవం, భూమి-నీటి సమస్యలు, గ్రామీణాభివృద్ధి, సామాజిక సమానత్వం, బడుగువర్గాల సమస్యలపై ఆయన రచనలు అవగాహన కల్పించాయి. ఈ రచనలు సమాజంలో మార్పునకు, ప్రజల సాధికారికతకు మూలస్తంభంగా నిలిచాయి. వెంకట్ గౌడ్ తుది శ్వాస విడిచినప్పటికీ ఆయన రచనలు, పరిశోధనలు తెలంగాణ సాహిత్య, సామాజిక, ఉద్యమ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి. 'వొడువని ముచ్చట', 'నీళ్ల ముచ్చట', 'సర్వాయి పాపన్న చరిత్ర' వంటి గ్రంథాలు తెలంగాణ ప్రజల్లో సామాజిక భావాన్ని కలిగిస్తూనే, బాధ్యతను గుర్తుచేస్తాయి. వెంకట్ గౌడ్ జీవితం తెలంగాణ యువత, ఉద్యమకారులు, సాహితీ ప్రియులకు మార్గదర్శకం. ఆయన చూపిన దారిలో నడుస్తూ తెలంగాణ యువత సమాజంలో సాధికారత, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవాన్ని పెంపొందించాలి. కొంపల్లి వెంకట్ గౌడ్ మృతి తెలంగాణ సాహితీ లోకానికి, ప్రజలకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, తెలంగాణ సాహిత్య ప్రపంచం ఆయనను ఎల్లవేళలా స్మరించుకుంటుంది.

# పింక్ సాల్ట్ వైట్ సాల్ట్.. ఇందులో ఆరోగ్యానికి ఏది మంచిది..?



రెండింటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి.. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.. ఉప్పు మన ఆహారంలో ఒక ముఖ్యమైన భాగం. కూరగాయలు వండడానికి అయినా, సలాడ్‌లో చేర్చుకోవడానికి అయినా లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ రుచిని పెంచడానికి అయినా ఉప్పును ప్రతిదానిలో ఉపయోగిస్తారు. కానీ అదనపు ఉప్పు అంటే అదనపు సోడియం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ సోడియం తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. అందుకే సాధారణ ఉప్పు కంటే పింక్ సాల్ట్ మంచిదా? తెలుసుకుందాం.

**పింక్ సాల్ట్ అంటే ఏమిటి?**

పింక్ సాల్ట్‌ను హిమాలయన్ సాల్ట్ అని కూడా అంటారు. ఈ ఉప్పును హిమాలయాలకు సమీపంలోని గనుల నుండి తీస్తారు. దాని గులాబీ రంగుకు కారణం దానిలో ఉండే ఐరన్ ఆక్సైడ్ వంటి ఖనిజాలు. పోషకాహార నిపుణురాలు హరిప్రియ ఎన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఉప్పు ఎక్కువగా ప్రాసెస్ చేయరు. అందుకే ఇది మరింత సహజమైనదిగా పరిగణిస్తారు.

**సాధారణ ఉప్పు అంటే ఏమిటి?**

సాధారణ ఉప్పు లేదా టేబుల్ సాల్ట్ సాధారణంగా ఉపయోగించే ఉప్పు. దీనిని ప్రాసెసింగ్ ద్వారా తయారు చేస్తారు. దీనిలో చాలా ఖనిజాలు తొలగిస్తారు. దీనికి యాంటీ-కేకింగ్ ఏజెంట్లు కూడా జోడిస్తారు. ప్రకారం, ఒక టీస్పూన్ సాధారణ ఉప్పులో దాదాపు 2400 సోడియం ఉంటుంది. అయితే %ఖూ ఖీణూ% రోజుకు 2300 కంటే తక్కువ సోడియం తీసుకోవాలని సిఫార్సు చేస్తుంది.

**పింక్ సాల్ట్ -సాధారణ ఉప్పు మధ్య తేడా ఏంటి?**

రెండూ ప్రధానంగా సోడియం క్లోరైడ్‌తో కూడి ఉంటాయి. పింక్ సాల్ట్‌లో 84-98 శాతం, సాధారణ ఉప్పులో 97-99 శాతం ఉంటాయి. రెండింటినీ ఆహార రుచిని పెంచడానికి, ఆహారాన్ని నిల్వ చేయడానికి ఉపయోగిస్తారు. రెండింటినీ అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది.

**తేడా ఏమిటి?**

**మూలం:** సముద్రపు నీరు లేదా ల్యాండ్ మైన్‌లను ప్రాసెస్ చేయడం ద్వారా సాధారణ ఉప్పును తయారు చేస్తారు. అయితే పింక్ సాల్ట్‌ను హిమాలయాలకు సమీపంలోని ఉప్పు గనుల నుండి తయారు చేస్తారు.

**ప్రాసెసింగ్:** సాధారణ ఉప్పు మరింత శుద్ధి చేస్తారు. దానికి అయోడిన్ జోడిస్తారు. పింక్ సాల్ట్ సహజమైనది. అలాగే శుద్ధి చేయరు.

**ఖనిజాలు:** పింక్ సాల్ట్‌లో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి 84 కంటే ఎక్కువ ఖనిజాలు ఉన్నాయి (ఫుడ్స్ జర్నల్ ప్రకారం సమాచారం).

**రంగు, ఆకృతి:** సాధారణ ఉప్పు తెల్లగా, సన్నగా ఉంటుంది. అయితే గులాబీ ఉప్పు పింక్ కలర్‌లో ఉంటుంది. మరి సన్నగా కాకుండా కొంత దొడ్డుగా ఉంటుంది.

**రుచి:** సాధారణ ఉప్పు ఎక్కువ ఉప్పగా ఉంటుంది. అదే పింక్ సాల్ట్‌లో ఉప్పు తేలికపాటి , ఖనిజ రుచిని కలిగి ఉంటుంది.

ఆరోగ్య ప్రయోజనాలు: క్రమం తప్పకుండా ఉప్పు తీసుకోవడం వల్ల అయోడిన్ లోపాన్ని నివారించవచ్చు. పింక్ సాల్ట్ హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌కు సహాయపడుతుంది.

**ఇందులో ఏ ఉప్పు తీసుకోవాలి?**

రెండింటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి.. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.

# ఈ కూరగాయను మీరు ఎప్పుడైనా చూశారా..? కనిపిస్తే మాత్రం విడిచిపెట్టకుండా తెచ్చుకోండి.. ఎందుకంటే..?

శమార్కెట్‌లో మనకు రకరకాల కూరగాయలు లభిస్తుంటాయి. మనకు అందుబాటులో ఉండే రెగ్యులర్ కూరగాయలనే మనం తెచ్చుకుని వండి తింటుంటాం. అయితే కొన్ని సందర్భాల్లో మనం చిత్రాతిచిత్రమైన కూరగాయలను కూడా చూస్తుంటాం. అసలు వాటిని కూరగాయలు అంటారా, అవి ఏమిటి.. వాటిని ఎలా తినాలి..? అని కూడా సందేహిస్తుంటాం. కానీ అలాంటి కూరగాయల్లోనే అనేక పోషకాలు ఉంటాయి. వాటిని తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఇప్పుడు చెప్పబోయే కూరగాయ కూడా సరిగ్గా అలాంటిదే. అదే.. లింగాడ్. దీన్నే లింగడ్ అని, లుంగుడు కస్రోడ్ అని కూడా పిలుస్తారు. ఈ కూరగాయ చూసేందుకు చాలా చిత్రంగా ఉంటుంది. ఇది ఫెర్న్ జాతికి చెందిన మొక్క లాగా కనిపిస్తుంది. మన దేశంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఈ కూరగాయలను ఎక్కువగా పండిస్తారు. ఈ కూరగాయను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

**మలబద్ధకానికి చెక్..**

లింగాడ్ కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నివారించవచ్చు. ఈ కూరగాయల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. రేచీకటిని తగ్గిస్తుంది. ఈ కూరగాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. అలాగే మలబద్ధకం తగ్గుతుంది. కడుపు ఉబ్బరం నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

లింగాడ్ కూరగాయల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు తగ్గిపోతాయి. ఈ కూరగాయలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో అధికంగా ఉండే ఫైబర్ వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఈ కూరగాయల్లో అధికంగా ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని నియంత్రణలో ఉండేలా చేస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ కూరగాయల్లో ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు సైతం ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇవి మేలు చేస్తాయి. ఈ కూరగాయల్లో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**పోషకాలు అధికం..**



100 గ్రాముల లింగాడ్ కూరగాయలను తింటే సుమారుగా 35 నుంచి 45 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 2 నుంచి 6 గ్రాములు, ఫైబర్ 4 గ్రాములు, విటమిన్లు ఎ, సి, బి విటమిన్లు, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి మినరల్స్ వీటిల్లో అధికంగా ఉంటాయి. లింగాడ్ కూరగాయలు మనకు సీజన్‌లోనే కనిపిస్తాయి. వర్షాకాలంలో మనం వీటిని మార్కెట్‌లో చూడవచ్చు. వీటిని వండే ముందు శుభ్రంగా కడిగి కట్ చేసి వండాల్సి ఉంటుంది. పూర్తిగా ఉడకని లేదా శుభ్రంగా కడగని లేదా పచ్చి లింగాడ్ కూరగాయలను తింటే విషంగా మారే ప్రమాదం ఉంటుంది. కొందరికి ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశాలు ఉంటాయి. ఈ కూరగాయలను రెగ్యులర్‌గా చేసుకునే కూరలు, వేపుళ్ల మాదిరిగా లేదా పచ్చళ్ల మాదిరిగా చేసుకుని తినవచ్చు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ వీటిని తింటే అనేక లాభాలను పొందవచ్చు.



# ఇంటి ముందు బొప్పాయి చెట్టు ఉంటే ఏమౌతుందో తెలుసా..? అశుభానికి శ్రీకారం అక్కడి నుంచే..!

హిందూ మతంలో వాస్తుకు అత్యంత ప్రాధాన్యనిస్తారు. ఇల్లు ఏ దిక్కున నిర్మించుకోవాలి. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ పెట్టాలి. ఇంటి ప్రవేశ ద్వారాం, గేట్ ఎలా ఉండాలి..? ఇంటి ముందు ఎలాంటి మొక్కలు, చెట్లు పెంచుకోవాలి. వాస్తు ప్రకారం ఇంటి ఆవరణలో ఎలాంటి మొక్కలు పెంచుకోవాలి.. ఎలాంటి చెట్లు నాటుకోవాలి.? వంటి అనేక అంశాలు వాస్తులో ప్రస్తావించారు. అయితే, ఇంటి ఆవరణలో బొప్పాయి చెట్టు పెడితే ఏమౌతుందో తెలుసా...? వాస్తు నిపుణులు ఏం చెబుతున్నారంటే.. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్న స్థలంలోనే ఏదో ఒక పూలు, పండ్ల చెట్లను పెంచుతున్నారు. ఇది మంచి అలవాటు. కానీ, మీరు మీ ఇంటి ఆవరణలో పెంచే చెట్లు, మొక్కలు మీ ఇంటి వాస్తును ప్రభావితం చేస్తాయని మీకు తెలుసా..? కొన్ని రకాల మొక్కలు ఇంటి ఆవరణలో పెంచటం వల్ల ప్రతికూల ఫలితాలను కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటిదే బొప్పాయి కూడా ఒకటి.. వాస్తు శాస్త్రం ప్రకారం.. బొప్పాయి చెట్టు ఇంటి ముందు ఉండటం మంచిది కాదని చెబుతారు. ఇంటి ముందు బొప్పాయి చెట్టు పొరపాటున పెరిగినా కూడా దాన్ని వెంటనే పీకి మరో చోట నాటాలని వాస్తు శాస్త్రనిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. ఇంటి ముందు బొప్పాయి చెట్టు ఉండటం వల్ల మీరు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని వాస్తుశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఇంటి ముందు బొప్పాయి చెట్టు పెంచటం వల్ల ఆ ఇంట్లో ప్రశాంతత, సంతోషాలు దూరం అవుతాయని అంటున్నారు. అందుకే ఇంటి ముందు బొప్పాయి చెట్టును నాటకూడదని చెబుతుంటారు. వాస్తు ప్రకారం.. ఇంటి చుట్టు ముట్టూ కూడా బొప్పాయి చెట్టును నాటకూడదని అంటున్నారు. ఎందుకంటే బొప్పాయి చెట్టు అశుభానికి సంకేతంగా భావిస్తారు. ఇంటి ఆవరణలో బొప్పాయి మొక్కను నాటితే ఇంట్లో ఎప్పుడూ డబ్బు కష్టాలు వెంటాడుతాయని చెబుతున్నారు అంతేకాదు, ఇంట్లో ఎప్పుడూ గొడవలు, చికాకులు కలుగుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. బొప్పాయి చెట్టు పూర్వీకుల నివాసంగా భావిస్తారు. అందుకే ఈ చెట్టును ఇంటి దగ్గర, ఇంటి ముందు నాటకూడదని అంటున్నారు. ఇంటి ముందు, ఆవరణలో బొప్పాయి చెట్టు ఉండటం వల్ల పిల్లలకు ఎప్పుడూ బాధలు, కష్టాలు వస్తాయని అంటున్నారు. అందుకే ఇంటి ముందు బొప్పాయి చెట్టును నాటడం మంచిది కాదని చెబుతున్నారు.

## ఎనుకట బతుకమ్మ కథ గిదీ..



నా పేరు దానెపెల్లి లింగమ్మ. నాకు టొంబయైదేండ్లు ఉంటయ్. మా అమ్మమ్మకు నా కన్న అరువై ఏండ్లన్నా ఎక్కువుంటయ్ గదా! అంటే నూటయాభై ఏండ్ల కింది నుంచి ఆడోళ్ల పెద్ద పండుగు బతుకమ్మ పండుక్కు బతుకమ్మ పాటలు మా పెద్దోళ్ల నుంచే నేర్సుకొని పాడుకునేది. వందలేండ్ల నుంచి సదువు రాని మేమేమో వందల పాటలు నేర్సుకొని పాడుకుంటే, ఇప్పటి ఆడిపిల్లలేమో వందల పుస్తకాలు సద్వుకొని ఎన్నో డిగిరీలు పాసైతుంద్రు, నౌకర్లు జేత్తుంద్రు గానీ, ఒక్క బతుకమ్మ పాట గూడ నేర్సుకుంటలేరు, పాడుతలేరు. గవ్వెందో డీజేలు వెట్టి, కోలలు వట్టి ఎగురుతుంద్రు. నా కండ్ల ముందట్నే వందలేండ్ల ఆషారం పాడైపోతంటే బాధపడుకుంట మా ఎనుకట మేము ఎట్లెట్ల బతుకమ్మ పాటలు నేర్సుకొని పాడుకునేదనే ముచ్చట జెప్తున్న. కనీసం నాడు గట్లుండెనట అనన్నా తెల్సుకుంటరు గదా! రామగుండం దగ్గిరి మంతినిలో ఉండే మా అమ్మమ్మ వాళ్ల చెల్లెకు పిల్లలు పుట్టకపోతే మా తల్లిని పెంచుకొని పెద్దగైనంక పెండ్లి జేసి ఎగులాసపురం ఇచ్చింది. మంతినిలో బాగ మందికి బాగ బతుకమ్మ పాటలు అచ్చేటియట. మా అమ్మ కొన్ని పాటలు నేర్సుకున్నది. ఆమె నుంచి నేను నేర్సుకున్న. ఎనుబయైదేండ్ల కింద మా ఎగులాసపురంలో మురళయ్య దొర ఇంటి ముందటే ఊర్లె ఆడిపిల్లలందరం ఆడుకునేటోళ్లం. దొర తల్లి కిట్టవ్వ ఆడిపిచ్చేది. పెత్రమాసకు ముందుగాళ్ల చ్చే పున్నాన్ని బొడ్డెమ్మ పున్నం అనేటోళ్లు.

ఆనాటి నుంచి బొడ్డెమ్మలు ఆడుకునేటోళ్లం. అట్ల సద్దుల బతుకమ్మ నాటికి మూడు వారాలు ఆడుకునేటోళ్లం. మాకు పిల్లలకు బొడ్డెమ్మ పాటలు గాని, బతుకమ్మ పాటలు గాని అంత ఎక్కువ రాకపోవు. రాకపోతే మా ఊర్లె ఒక మన్నె పు ముసలోడు రోజుకు అరసోడు జొన్నలిత్తె పాడెటోడు. ఆయనెనుక మేం పాడేటోళ్లం. అట్లనే ఇంకో మన్నెపు ముసలవ్వ గూడ రోజుకు అరసోడు జొన్నలిత్తె పాడేది. ఆళ్ల నుంచి కొన్ని బతుకమ్మ పాటలు నేర్సుకున్న %-% రజాకార్ల జమానాకు ముందుగాల్నె. ఇగ రజాకార్ల జమానా అయిపోయి మన దేశానికి గాంధీ, నైరు సతంత్రం దెచ్చినంక నాకు లగ్గమయి ఎల్లటూరు మండలం మంగలిగడ్డకు అచ్చి పది పన్నెండేం డ్లు అయినంక శెగ్యామ పటేండ్ల చేన్లు, పొలాలకు కయికిలికి కలువపోతుంటి. నా తీర సుట్టుపక్కల ఊళ్లు ఉండెడ, యెమునూరు కాన్నుంచి కూడ మాదిగి మన్నెపోళ్లు కయికిలికి అచ్చేటోళ్లు. మన్నెపు ఆడోళ్లు బతుకమ్మ పాటలు బాగ పాడుతుండిరి. అయ్యి ఇని నేర్సుకున్న. మా మామ పెద్ద సాలీడు/ పెద్దకులస్థుడు కాబట్టి, మా ఇంటి ముందట్నే బతుకమ్మ బాయి తోడుతుండిరి. మా వాడకట్టోళ్లందరు అక్కడనే బతుకమ్మలాడుతుండిరి. నేను ముందు పాడితే నా ఎనుక అందరూ పాడుతుండిరి. మా అత్తమామ కాలం జేసినంక ఆళ్లున్న ఇంటి పై కప్పు పోయి గోడలే మిగిల్నయి. నా నడిపి బిడ్డ సూరక్క, సుట్టుపక్కల ఆడిపిల్లలు బతుకమ్మలను తీసుకపోయి బతుకమ్మబాయి కాడ పెట్టి పాటలు పాడరాక ఆ గోడలకానుకొని బీరిపోయి నిల్సునేటోళ్లు. ఇగ నేనే పొయ్యి పాడితే అప్పుడు పిల్లలందరూ సంబురపడుకుంట నా ఎనుక పాడుతుండిరి. నలుపయ్యేడేళ్ల కింద నా పెద్ద బిడ్డ సుగుణ యాడాది కొడుకు చచ్చిపోయి, నా తల్లి గూడ అదే యేడు చచ్చిపోయి దుఃఖంల ఉండి నేను ఆడకపోతే బతుకమ్మ బాయి కాడ గూడ అందరూ ఆడుకోకుండ ఉత్తగనే నిల్చున్నరు- పాటలు రాక. మళ్ల నేనే పొయ్యి దేవునికి శమించుమని మొక్కి పాడితే అందరూ నా ఎనుక పాడింద్రు. ఒక్కసారి బతుకమ్మ పండుక్కు మా తల్లిగారింటికి పోయిన. అప్పుడు ఓ రోజు కయికిలికి కలువపోయినకాడ ఒకరు బతుకమ్మ పాటలు పాడుమంటే పాడిన. అది ఇన్న ఓ పెద్ద మనిషి శాలోల్ల ఇండ్లకాన్నే బతుకమ్మ పాటలు పాడుమన్నడు. అట్లనే శాలోల్ల వాడకట్టుకే పాడుకుంట ఉన్న. దొరగారి కిట్టవ్వ ఆడిపిల్లల్ని మా దగ్గరికి రానియ్యలే. కానీ ఆళ్ల దగ్గర పాడేటోళ్లు ఎవ్వరు లేక ఒకరెనుక ఒకరు అందరూ మా బతుకమ్మకాడికే ఉరికచ్చింద్రు. ఇగ అటెనుక తప్పక కిట్టవ్వ నన్ను అచ్చి పాడుమని మనిషిని పంపితే నేను ఆనాడు పోలేదు గానీ తెల్లారినాడు పోయి పాడిన.

45 ఏండ్ల కింద గోదారి వరదలకు బయపడి మా సొంతూరు మంగలిగడ్డను ఇడిసిపెట్టి పక్కూరు శెగ్యామకచ్చినంక గూడ మా వాడకట్టుకు నేనే పాడు డు. పతి వాడకట్టుకొక్కరే పాడేటోళ్లుందురు. ఐతే శెగ్యామ మన్నెపు ఆడోళ్లకు గూడ బాగనే పాటలత్తయ్. గానీ, నాడు ఆ మాదిగి మన్నెపోళ్లు, రెడ్లు, ఎల్మలు గూడ బతుకమ్మ ఆడకపోతుండిరి. తరువాత్తరువాత పెద్ద కులపోల్లు గూడ అల్ల ఇండ్లల్లనే బతుకమ్మలు పెట్టి చిన్న కులపోల్లను ఆడుమంటుండిరి. ఈ మద్దె అందరాడుతున్నరు. బతుకమ్మ పాటలు ఎన్ని పాటలైన పాడచ్చు. కథ తెలిత్తే అల్లుకుంట పోవుడే. అట్ల నేను ఎన్నో కథలను బతుకమ్మ పాటల తీర కైగట్టి పాడేది. పురాండెం, రామాండం, భారతం, సతీసావిత్రి పాము పాట, ఎల్లమ్మ కథ, మల్లన్న కథ, ఒగ్గు పట్నాల కథ, పసుపు బండారి తెచ్చే కథ%ౌ% ఇట్ల ఎన్నో పాటలు పాడేది. ఊర్లెకే అచ్చి మాదిగి మన్నెపోళ్లను అడుక్కునేటోళ్లు చిందోళ్లు, మాట్లోళ్లు%ౌ% ఇట్ల ఎందరో ఎన్నో కథలు ఆడేటోళ్లు, పాడేటోళ్లు గదా! ఆళ్ల నుంచి ఎన్నో కథలు నేర్సుకొని బతుకమ్మ పాటల తీరుగ కైగట్టి పాడేది. నా నుంచి నా చిన్నబిడ్డ దేవక్క బతుకమ్మ పాట లు బాగ నేర్సుకున్నది. ఆమెను ధర్మపురి మండలంల రాయపట్నంకు ఇచ్చినం. ఆమె అత్తగారింటికి పోయినంక మళ్లిన్ని పాటలు నేర్సుకున్నది. పెద్ద పెద్ద పాటలు, గురువమ్మ పాట నాకు అచ్చినట్టే దేవక్కకు గూడ అచ్చు. గానీ, నాకు రాని గుర్రం మీది రాజు పాట కొత్తగ నేర్సుకున్నది. మస్తు పాటలు పాడుతది. ఇగ అట్ల ఆమెతో పాడిచ్చి కొన్ని ముక్కెమైన పాటల్ను నా చిన్న కొడుకు సత్యనారాయణ రాత్తే ఆ పుస్తకాన్ని మూడేండ్ల కింద పబుత్తమే చెపాయించింది. అయన్ని ఎనుకటి నుంచి అత్తన్న పాటలు. గసొంటియి పాడుకోవాలె, గమ్మతుంటది. ఈ మద్దె ఆడిపిల్లగాండ్లు ఏందేందో పిచ్చి పిచ్చి పాటలు, ఏందో డీజేలని పెట్టుకుంట పిచ్చిపిచ్చిగ ఎగురుతుంద్రు, దునుకుతుంద్రు. కోలలు కొడుతంద్రు. కోలలు గొట్టుడు ఎక్కడ్నుంచి అచ్చిందో! మాకైతే ఎరుకనే లేదు. ఇప్పుడు సెల్‌పోన్లల్ల, డీజేలల్ల పెట్టుకుంటున్న పాటలు గూడ నాటి ఆషారపు పాటలు కాదు. ఏవో పిచ్చిపిచ్చి పాటలు. ఆటివల్ల పిడిపిడీల నుంచి అత్తన్న మన ఆషారాలు బొషత్

### పిల్లలకెట్ల తెలుత్తయ్?

నాడు తంగెడుపూలు, గునుకపూలు, కట్లపూలు, గోరంటపూలు, బంతిపూలు, గుమ్మడిపూలు, బీరపూలు%ౌ% ఇట్ల ఎన్నో తీరొక్క పూలు తెచ్చి బతుకమ్మను ఎంతో శుంగారంగ పేరిచ్చుకునేది. బతుకమ్మ ఎంత పెద్దగుంటే అంత గొప్ప అని పోటీవడి పేరిచ్చుకునేది. చవితి తెల్లారి నుంచి శిబ్బిల పూలేసుకొని పోయి వాడకట్టుకు ఆడుకునేది. ఇరువయైదొద్దులు అట్ల ఆడుకున్నంక పెత్రమాసనాడు పొద్దుగాల పెద్దలకు బియ్యమిచ్చి పూలు, పత్రి పెట్టి పూజించి తిన్నంక ఇగ మిగిల్న పూలు ముందటేసుకొని చిన్న బతుకమ్మ, పెద్ద బతుకమ్మల పేరిచ్చుడు. అందుకే ఆటిని ఎంగిలి పూల బతుకమ్మలంటరు. ఆనాడు బతుకమ్మ బాయి తవ్వి, అండ్ల ఎంపలి చెట్టు నాటి, ఆనాటి నుంచి బాయి చుట్టూ సప్పట్లు కొట్టుకుంట తిరుక్కుంట ఆడిపాడుకునుడు. ఆనాడు గూడ ఆడిపిల్లలు, పెద్ద మనుషులు అందరాడేది. అట్ల అర్రెం (ఆరో దినం) ఇడిసి ఏడు దినాలు ఆడుకున్నంక ఎనిమిదో దినం సద్దుల బతుకమ్మ నాడు ఆడోళ్లందరూ ఒగలకొగలు చెంపలకు పసుపు బెట్టుకొని, బతుకమ్మల మీది గౌరమ్మల దగ్గర అన్నం, పెరుగు, నెయ్యి, శక్కరి కలిపి సేసిన సద్దులు వెట్టేది. అందుకే ఆ బతుకమ్మలను సద్దుల బతుకమ్మలు అనేది. మా తల్లి మక్కపిండిల బెల్లం, పాలు కలిపి మక్క సత్తు సేసేది. మా కమ్మగుండు. ఇప్పుడేందో పిలాస్టిక్ బతుకమ్మ, లేపోతే ఇన్నన్ని బంతిపూలను చిన్న తట్టలేసుకొని దాన్నే బతుకమ్మ అంటుంద్రు. ఇయ్యన్ని ఇచ్చంత్రాలు జూత్తె కడుపు కోసుకపోతంది గానీ ఏం జెయ్యాలె? నాటి బతుకమ్మలు ఎంత ముద్దుగుండేటియి! ఎంత ఆరోగ్గెంగ ఉండేటియి! అప్పటి ఆతావరణమే ఎంతో మంచిగుండె. ఇప్పుడు గూడ పిలాస్టిక్‌ను బంద్ జేత్తున్నట్టు పిలాస్టిక్ బతుకమ్మలను గూడ బంద్ వెట్టి పబుత్తం మంచిగ నాటి పాటలను పషారం జేత్తె అందరికీ మంచిగుంట ది. ఇప్పుడు పతొక్కల సేతుల్ల సెల్లు పోన్లేనాయే. పషారం జేత్తె అయిపాయె.

# చీర కాదు కదా దారం పోగూ ఇవ్వలే!



సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ పుట్టినిల్లు. ప్రపంచవ్యాప్తంగా పూలతో ఆ దేవుడిని పూజిస్తే, పూలనే దైవంగా భావించి పూజించే సంస్కృతి ఈ నేలది. ఆడబిడ్డలను దేవతామూర్తులుగా కొలుస్తుందీ గడ్డ. అలాంటి ఆడబిడ్డలు కొలిచే బతుకమ్మకు స్వరాష్ట్రంలో పూర్వవైభవం తీసుకువచ్చారు కేసీఆర్. తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డను తన ఇంటి బిడ్డగా భావించారు. బతుకమ్మ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి ప్రతీ ఇంటి ఆడబిడ్డ కళకళలాడాలని చీరె సారె ఇచ్చి గౌరవించారు కేసీఆర్. కానీ, కాంగ్రెస్ సర్కారు గత రెండేండ్లుగా బతుకమ్మ చీరలు ఇవ్వకుండా తెలంగాణ అస్తిత్వానికి అయిన బతుకమ్మను అవమానిస్తున్నది.

పండుగ పూట రాష్ట్ర ప్రభుత్వం అమ్మవార్లకు చీరె సారెలు సమర్పించడం తరాలుగా వస్తున్న ఆనవాయితీ. తెలంగాణలో జరుపుకొనే అతిపెద్ద పండుగల్లో బతుకమ్మ కూడా ఒకటి. తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డలను దేవతగా భావించిన కేసీఆర్ సర్కార్ తరఫున బతుకమ్మ చీరల రూపంలో సారెలను సమర్పించారు. 2017, సెప్టెంబర్ 27న సిద్దిపేటలో తొలిసారి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ ఏడాది సెప్టెంబర్ 30న దసరా పండుగకు ముందు మూడే మూడురోజుల్లో ఎలాంటి హంగూ ఆర్భాటాల్లేకుండా రేషన్ షాపుల ద్వారా కోటి మంది ఆడబిడ్డలకు చీరలను పంపిణీ చేశారు. నాటినుంచి 2023 వరకు ఏడేండ్ల పాటు నిర్విరామంగా రేషన్‌కార్డులో పేరున్నా, లేకపోయినా 18 ఏండ్ల నుంచి పండు ముదుసలి దాకా అందరికీ ఏటా చీరెలను పంచారు కేసీఆర్. ఏటా రూ.370 కోట్లు కేటాయించి 100కు పైగా రంగు లు, 250కి పైగా వెరైటీలు, కండ్లు మిరుమిట్లు గొలిపే డిజైన్లతో పట్టును మించిన నేత చీరలను పంచేవారు. తద్వారా నేతన్నలకు ఉపాధి కల్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టబోయే బిడ్డ నుంచి గిట్టబోయే ముసలోళ్ల వరకు అందరికీ 420 హామీలిచ్చిన కాంగ్రెస్ బతుకమ్మను వదల్లేదు. కేసీఆర్ సర్కార్‌ను మించి ఒకటికి రెండు చీరలిస్తామని వాగ్దానం చేసి నేడు నిండాముంచింది. రెండు చీరల సంగతేమో గానీ ఒక్క చీరకూ దిక్కు లేదు ఇప్పుడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది రెండో బతుకమ్మ. చావు కబురు చల్లగా చెప్పినట్టు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఈ ఏడాది కూడా బతుకమ్మ చీరలు పంచడం లేదని చెప్పి చేతులు దులుపుకొన్నారు.

వాస్తవానికి 2023లో బతుకమ్మ పండుగ తర్వాత అంటే, డిసెంబర్‌లో కాంగ్రెస్ సర్కార్ గద్దెనెక్కింది. అప్పటినుంచి 2024 బతుకమ్మ దాదాపు ఏడాది సమయం ఉంది. కానీ, ఒడ్డుకు చేరాక తెప్ప తగలేసే అలవాటున్న కాంగ్రెస్ బతుకమ్మలకు ఇచ్చిన హామీని ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. పుణ్యకాలం కాస్త గడిచిపోయాక గతేడాది చీరలు ఇవ్వకుండానే, బతుకమ్మ చీరల పథకానికి ఇందిరమ్మ తోకను తగిలించారు. ఈ ఏడాది మొదటినుంచీ హడావుడి చేశారు. రేషన్‌కార్డుల ప్రకారం కాకుండా స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ ఒకటి కాదు, రెండు చీరలు ఇస్తామని గప్పాలు కొట్టారు కాంగ్రెస్ పాలకులు. రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల మంది సభ్యులుండగా, సెర్ప్ ద్వారా 65 లక్షల చీరలకు ఆర్డర్లు ఇచ్చినట్టు చెప్పా రు. ఒక్కో చీరను రూ.800 వెచ్చించి నాణ్యతతో తయారు చేయిస్తున్నట్టు గొప్పలకు పోయారు. దసరాకు ముందే సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు చీరలను పంపిణీ చేస్తామని కూడా కాంగ్రెస్ పాలకులు చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కాకుండా మొదటి విడతలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంపి ణీ చేస్తామన్నారు. కానీ, బతుకమ్మ అయిపోతున్నా ఒక్కటంటే ఒక్క చీర ఇవ్వలేదు తెలంగాణ ఆడబిడ్డలకు. గత బీఆర్‌ఎస్ సర్కారు ఒక్కరినీ విస్మరించకుండా ప్రతీ ఆడబిడ్డకు ఒక్కో చీర చొప్పున సుమారు కోటీకి పైగా చీరలను పంపిణీ చేసింది. కానీ, కాంగ్రెస్ కాంగ్రెస్ సర్కారు ఒక్క చీర ఇవ్వకముందే సగం మంది మహిళలకు కుచ్చుటోపీ పెట్టింది. మహిళా సంఘాల్లోని సభ్యులకు ఇస్తామని ప్రకటించి, అందులో సభ్యత్వం లేని యువతులకు మొండిచెయ్యి చూపింది.

గతంలో ఇచ్చినట్టే కోటి చీరలనే ఇస్తానని చెప్తూనే, ఒక్కొక్కరికీ రెండు చీరలు ఇస్తానని పోజులు కొట్టింది. చివరికి అవి కూడా ఇవ్వలేదు. నిజానికి, ఒక్కో సభ్యురాలికి రెండు చీరలు ఇవ్వాలంటే సుమారు 1.30 కోట్ల చీరలకు ఆర్డర్లు ఇవ్వాలి. కానీ, కాంగ్రెస్ సర్కారు 65 లక్షల చీరలే ఆర్డర్లు ఇచ్చింది. దీన్నిబట్టి రేవంత్ సర్కారు నైజం ఏమిటో అర్థమవుతున్నది. ఇప్పుడు బతుకమ్మ పండుగ వచ్చింది కాబట్టి, నాలుగు రోజులు అదిగో ఇస్తున్నాం, ఇదిగో ఇస్తున్నామని హడావుడి చేస్తారు. ఆ తర్వాత గత రెండేండ్లుగా చేస్తున్నట్టే యథావిధిగా మర్చిపోతారు. ఇప్పటికే రెండేండ్లు గడిచిపోయాయి. కాంగ్రెస్ సర్కారు ఉండేది ఇంకా మూడేండ్లే. ఈ మూడేండ్లలో అయినా తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ చీరలకు నోచుకుంటరో లేదో? అయినా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మను మాయంజేసిన నాడే అర్థం జేసుకోవాల్సింది కాంగ్రెస్ వాళ్లు చీర కాదు కదా, దారం పోగు కూడా ఇవ్వరని.

# తెలంగాణను కన్నతల్లి బీఆర్ఎస్



ఏండ్ల తరబడి పురిటి నొప్పులు భరిస్తూ, ప్రాణాలకు తెగించి మరీ బీఆర్ఎస్ ప్రసవించిన బిడ్డ తెలంగాణ. బిడ్డకు తల్లిని మించిన సంరక్షకులు లేనట్టే, తెలంగాణకు బీఆర్ఎస్‌ను మించిన రక్షకులు లేరన్నది చరిత్ర నిరూపించిన సత్యం. ఎలాగంటే, ఆరు దశాబ్దాల పాటు అన్య పార్టీల పాలనలో అట్టడుగున ఉన్న 'చీకటి వెలుగుల ఆకలి తెలంగాణ' నవ వసంతాల బీఆర్ఎస్ పాలనలో 'వెలుగుల అన్నపూర్ణ'గా భారతాగ్ర రాష్ట్రాల సరసన తలెత్తుకు నిలబడటమే అందుకు నిలువెత్తు నిదర్శనమంటున్నారు ఆర్థికవేత్తలు. బీఆర్ఎస్ పాలనలో వివిధ రంగాల్లో తెలంగాణ 100 శాతం నుంచి 400 శాతం వరకు వృద్ధి సాధించింది. అభివృద్ధి, సంక్షేమాలను రెండు పట్టాలుగా నిర్మించి, వాటిపై 'వందే తెలంగాణ' అని కూత పెట్టిస్తూ ప్రగతి రైలును పరుగులు పెట్టించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్. తత్కారణంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన రెండో ప్రాంతంగా తెలంగాణను గుర్తించారు ప్రగతి పరిశోధకులు. అందుకు మేమే సాక్షులమంటున్నాయి ఆర్‌బీఐ, నీతిఆయోగ్ నివేదికలు. అలా బీఆర్ఎస్ పాలనలో శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందిన తెలంగాణ రెండేం డ్ల పాలనలోనే కృష్ణ పక్ష చంద్రునిలా నానాటికీ దిగజారుతుండటాన్ని చూశాక ఇప్పుడు వెనక్కి తిరిగి ఆత్మవిమర్శ చేసుకుంటున్నారు ప్రజలు. వాళ్ల ఊకదంపుడు ఉపన్యాసాలను, అబద్ధపు హామీలను, కూలీ ఇచ్చి వాళ్లు చేయించుకునే మీడియా ప్రచారాలను నమ్మి, ఆశపోతులకు అధికారమిస్తే అభివృద్ధి సంగతి దేవుడెరుగు.. ఉన్న ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు తెగనమ్మి, లక్షల కోట్ల అప్పులను తమ నెత్తిన పెడుతారని కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో కాంగ్రెస్ పాలన ద్వారా తెలిసిందంటున్నారు ప్రజలు. బీఆర్ఎస్‌ను జారవిడుచుకోవడం తల్లిని కోల్పోవడమేనంటూ ఇప్పుడు వాపోతున్నది తెలంగాణ.

అతి స్వల్పకాలంలో ఇంతటి అభివృద్ధిని ఎలా సాధించగలిగారు కేసీఆర్? దేశవ్యాప్తంగా తలెత్తిన ఈ ప్రశ్నకు రాజకీయ పరిశీలకులు చెప్తున్న జవాబిది. నాయకుడికి కేవలం ప్రజల పట్ల ప్రేమ ఉంటే చాలదు. వాళ్ల సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర ప్రగతి కోసం ఏం చేయాలో స్పష్టమైన జ్ఞానం కూడా కావాలి. నిరంతర పరిశీలన, అధ్యయనాల వల్లనే నాయకుడికి జ్ఞానపుష్టి కలుగుతుంది. కానీ, నేడు రాబోయే ఎన్నికల గురించి ఆలోచించే రాజకీయ వ్యాపారులే తప్ప, భావితరాల భవితవ్యం కోసం అధ్యయనం చేసే రాజనీతిజ్ఞులే కరువయ్యారు. 'వేలాది మందిలో ఎవడో ఒకడు జ్ఞానసిద్ధికి యత్నిస్తాడు. అట్టి జ్ఞానార్థుల్లోనూ ఎవడో ఒకడు సత్యాన్ని యథాతథంగా గ్రహించగలుగుతాడు' అంటున్నది భవద్గీత (గీత 7-3). అరుదైన అలాంటి జ్ఞానశ్రేష్ఠుల్లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అగ్రగణ్యులు. వివిధ దేశాల పరిశీలన, నిరంతర అధ్యయనాల వల్లనే తెలంగాణల ప్రగతికి సుస్థిర పునాదులను నిర్మించి చరితార్థులయ్యారు కేసీఆర్. 'నీళ్లు ఎక్కడో, అభివృద్ధి అక్కడ!' అన్న చారిత్రక అనుభవాన్నిబీ వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు ప్రగతి రథానికి రెండు చక్రాలన్న చారిత్రక సత్యాన్ని గ్రహించిన కేసీఆర్ తొలుత ఆ దిశగానే తమ కృషిని ప్రారంభించారు.

మిషన్ కాకతీయ పేరిట కాకతీయుల కాలం నాటి చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం పేరిట ప్రపంచైక భారీ ఎత్తిపోతల పథకం ద్వారా 100 శాతానికి పైగా సాగు, తాగునీటిని విస్తరింపజేసి వ్యవసాయాభివృద్ధికిబీ ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, వేలాది గురుకులాలు, ఎడ్యుకేషన్ హబ్‌ల ద్వారా విద్యాభివృద్ధికిబీ ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణ, జిల్లాకో మెడికల్ కళాశాల ద్వారా వైద్యాభివృద్ధికిబీ విస్తృత మౌలిక వసతుల కల్పన, 'టీ పాస్-ఐపాస్' విధానం ద్వారా పారిశ్రామికాభివృద్ధికిబీ ఐటీ హబ్‌ల ద్వారా సాంకేతిక విద్యాభివృద్ధికి దృఢమైన పునాది నిర్మించారు తెలంగాణ పిత కేసీఆర్. గొలుసుకట్టు చెరువుల ద్వారా వాన నీటిని వృథా పోకుండా, ఎత్తు నుంచి పల్లపు ప్రాంతాలకు సాగు, తాగునీటినందించి చరితార్థులయ్యారు కాకతీయులు. అలాగే నదీజలాలను వృథాగా పోనివ్వకుండా గొలుసుకట్టు రిజర్వాయర్ల ద్వారా పల్లపు ప్రాంతం నుంచి 1,600 అడుగుల ఎత్తున గల గ్రామాల దాకా 1,530 కిలోమీటర్ల దూరం వరకు గోదావరి జలాలను ప్రవహింపజేసి అభినవ భగీరథునిగా చరితార్థులయ్యారు కేసీఆర్. ఇంతటి బృహత్తర ప్రాజెక్టును నిర్మించడం మాట అటుంచి.. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల్లో ఏ ఒక్కరూ కనీసం దాన్ని ఊహించలేరని చెప్తున్నారు తెలంగాణ ప్రజలు.

ఇలా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి దృఢమైన పునాదిని రూపొందించడమే గాక, అపూర్వ ఆధ్యాత్మిక శిల్పకళా క్షేత్రం యాదగిరిగుట్ట, ఎడ్యుకేషన్ హబ్, ఐటీ హబ్, సుందర, కళాత్మక సచివాలయం, అద్భుతమైన అంబేద్కర్ విగ్రహాలను తెలంగాణ తల్లికి చిరస్మరణీయ ఆభరణాలుగా సమర్పించారు కేసీఆర్. అంతేకాదు, బీజేపీ పాలనలో పుల్వామా, పహల్గాం వంటి ఉగ్రవాద విధ్వంసాలు, పలు మత ఘర్షణలతో మన దేశం కల్లోల భారతం కాగా, బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఉగ్ర విధ్వంసం గాని, మత ఘర్షణకు గాని తావులేని ప్రశాంత రాష్ట్రంగా విరాజిల్లింది తెలంగాణ. బీజేపీ హయాంలో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా రాజధాని ఢిల్లీ తలవంచుకుంటే, బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ'గా తలెత్తుకు నిలిచింది. దటీజ్ బీఆర్ఎస్. దటీజ్ కేసీఆర్. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్.. 'రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చి వెళ్లింది' అంటూ అనుకూల మీడియా ద్వారా హోరెత్తిస్తున్నది. అది పచ్చి అబద్ధమని పార్లమెంట్ స్పష్టం చేసింది. 2014 నుంచి 2024 మార్చి వరకు తెలంగాణ అప్పులెన్ని? పెరిగిన ఆస్తులెన్ని? అంటూ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు పార్లమెంట్ ఈ విధంగా జవాబిచ్చింది. 'తెలంగాణ అప్పులు మొత్తం రూ.3.50 లక్షల కోట్లు. అందులో కొత్తగా రేవంత్ సర్కార్ చేసిన అప్పు రూ.40 వేల కోట్లు పోను, కేసీఆర్ సర్కార్ చేసిన అప్పు రూ.3.10 లక్షల కోట్లు మాత్రమే. బీఆర్ఎస్ హయాంలో పెరిగిన ఆస్తులు 4.15 లక్షల కోట్లు' అని. అయితే, రెండేండ్లలో రూ.2 లక్షల కోట్ల అప్పులు చేసిన కాంగ్రెస్ పార్టీ పదేండ్లలో రూ.3.10 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిన బీఆర్ఎస్ వైపు వేలెత్తిచూపడం విడ్డూరమంటున్నారు తెలంగాణ ప్రజలు. అంతేకాదు, పున్నమి చంద్రునిలో మచ్చల్ని లెక్కించి, వెక్కిరించాలన్న వక్రబుద్ధితో కాళేశ్వరంపై కమిషన్లు వేసి, విచారణలు చేసి వాటికి సాక్ష్యాలను సృష్టించే పనిలో బిజీ బిజీగా ఉన్నారు కాంగ్రెస్, బీజేపీ నేతలు. కేసీఆర్ మీదే కాదు, తమకు రాజకీయ లబ్ధి కలుగుతుందనుకుంటే కాకతీయులు, కాటన్ దొరల మీద కూడా విచారణ కమిషన్లు వేసేందుకు వెనుకాడని పార్టీలు కాంగ్రెస్, బీజేపీ. ఇలాంటి రాజకీయ కాలుష్య సమయంలో మంచేదో, చెడేదో సహేతుకంగా వివరిస్తూ, ప్రగతి మార్గాన పయనించేలా ప్రజలను చైతన్యపరచాల్సిన మేధావులు, మీడియా పెద్దలు ఏటివెంట కొట్టుకెళ్లే నిర్జీవపు కొయ్య మొద్దుల్లా అధికార ప్రవాహం వెంట కొట్టుకుపోతున్నారు. కాబట్టి, తెలంగాణ ప్రజలారా, సామాజిక శ్రేయోభిలాషులారా దయచేసి ఆలోచించండి. 'అంతరాత్మ సహాయంతో ప్రజలు తమకు తామే ఉద్ధరించుకోవాలి' అన్న భగవద్గీత (గీత 6-5) ప్రబోధాన్ని పాటించండి. మనకేదీ శ్రేయస్కరమో దాన్ని స్వయంగా ఎంచుకోవాలన్నది దీని భావం. ఆయా పార్టీల పాలనా ఫలితాలను బేరీజు వేసుకొని, మనకు ఏ పార్టీ పాలన శ్రేయస్కరమో దాన్ని ఎన్నుకుందాం.

# పెరుగులో బెల్లం కలిపి తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..? తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!



పెరుగును మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. భోజనం చివర్లో పెరుగును తినకపోతే చాలా మందికి భోజనం చేసిన సంతృప్తి ఉండదు. అలాగే బెల్లాన్ని కూడా మనం వాడుతూనే ఉంటాం. దీన్ని తీపి పదార్థాల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పెరుగులో బెల్లం కలిపి తింటే అనేక లాభాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ మిశ్రమం అత్యంత ఎక్కువ పోషక విలువలను కలిగి ఉంటుందని అంటున్నారు. కనుక దీన్ని తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని సూచిస్తున్నారు. పెరుగులో బెల్లం కలిపి తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. మలబద్ధకం ఉన్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

### జీర్ణ సమస్యలకు..

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల అనేక జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. బెల్లంలో ఉండే సహజసిద్ధమైన చక్కెరలు మన శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. చురుకుదనం వస్తుంది. బద్ధకం పోతుంది. పెరుగులో ఉండే ప్రోటీన్లు, కొవ్వులు షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని తినవచ్చు.

### ఎముకల ఆరోగ్యానికి..

ఈ మిశ్రమంలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే మెగ్నిషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల క్యాల్షియం కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక రకాల బి విటమిన్లు సైతం ఈ మిశ్రమం ద్వారా మనకు లభిస్తాయి. పెరుగు శరీరానికి చల్లదనం అందిస్తుంది. కనుక ఈ మిశ్రమాన్ని తింటే శరీరంలో ఉండే వేడి పోతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. కొందరికి సీజన్లతో సంబంధం లేకుండా శరీరంలో వేడి ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి వారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది.

### లివర్ ఆరోగ్యానికి..

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల లివర్, రక్తం శుద్ధి అవుతాయి. ఆయా భాగాల్లో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఈ మిశ్రమం వల్ల జీర్ణ వ్యవస్థ సైతం శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో బెల్లం కలిపి తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇక ఈ మిశ్రమం ఆరోగ్యకరమే అయినప్పటికీ కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం దీన్ని తినకూడదు. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు, విరేచనాలు అవుతున్నవారు, అలర్జీలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తినకపోవడమే మంచిది. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# విశ్వ బంధువే.. కానీ ఒంటరి!



మార్చి 10 నాటి బీజేపీకి సంబంధించిన ఒక సోషల్ మీడియా పోస్టులో ఇలా ఉంది. భారత ఇమేజ్‌ను ప్రధాని మోదీ ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్నారని, అనన్యసామాన్యమైన గ్లోబల్ గుర్తింపుతో భారతదేశాన్ని ఆయన నడిపిస్తున్నారని, మోదీకి 20కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు లభించడం ఆయన నాయకత్వానికే కాదు, ప్రపంచ వేదికపై 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమని ఆ పోస్టులో బీజేపీ రాసుకొచ్చింది. సంక్షిప్తంగా చెప్పాలంటే.. మోదీ ప్రపంచవ్యాప్తంగా మిత్రులను, పురస్కారాలను, ప్రశంసలను సంపాదించి, వివిధ దేశాల ప్రభుత్వాధినేతలతో సమావేశమవడం, ఫొటోలు దిగడం ద్వారా 140 కోట్ల మంది భారతీయులు గర్వపడే పనిచేశారని, తద్వారా ప్రపంచ యవనికపై ప్రతి భారతీయుడి గౌరవం ఇనుమడించిందని, మోదీ విదేశీ పర్యటనలు, అక్కడ ఆయన చేసే కార్యక్రమాల పట్ల భారతీయులు గర్వపడాలన్నది ఆ పోస్ట్ సారాంశం. సరిగ్గా రెండు నెలల తర్వాత మే 10న 55 ఏండ్ల కిందటి ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విదేశీ శక్తులతో భారత ప్రధాని ఎలా వ్యవహరించాలో హిందూ జాతీయవాదులకు తెలియజేయడమే ఈ వీడియో ప్రధాన ఉద్దేశం. 'మూణ్నాలుగు వేల మైళ్ల దూరంలో ఉన్న ఏ దేశమైనా సరే వర్ణాధిపత్యం ఆధారంగా భారతీయులకు ఆదేశాలిచ్చే కాలం చెల్లింది' అని 1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు నాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పిన సందేశం ఆ వీడియోలో ఉంది. అమెరికా, చైనా హెచ్చరికలను సైతం ధిక్కరించి పాకిస్థాన్ విభజనకు కారణమైన యుద్ధాన్ని ఇందిరాగాంధీ ఎలా కొనసాగించారన్న విషయాన్ని మోదీ విమర్శకులు ఈ వీడియోలో ప్రముఖంగా చూపించారు.

మే 10న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని మోదీకి అత్యంత ఇబ్బందికరమైన పరిణామాల్లో ఒకదాన్ని సృష్టించారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణను భారత్ కంటే ముందు ప్రకటించడమే కాదు, కాల్పుల విరమణ ఘనత తనదేనని కూడా ట్రంప్ చెప్పారు. అది కూడా వాణిజ్యం నిలిపివేస్తాననే బెదిరింపుల ద్వారా ఇరు దేశాలను ఒప్పించానని ఆయన పేర్కొన్నారు. మోదీ హయాంలో భారత స్థాయి పెరుగుదలను హిందూ జాతీయవాద సంస్థలు రాజకీయ లబ్ధి కోసం బాగా ఉపయోగించుకున్నాయి. 2023లో అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా భారతదేశంపై అంతర్జాతీయంగా నమ్మకం పెరిగిందని మోదీ స్వయంగా చెప్పారు. తత్ఫలితంగా భారతీయుల్లోనూ విశ్వాసం పెరిగిందని ఆయన అన్నారు. 2024లో ప్రధాని మోదీ జోక్యం కారణంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొంతకాలం ఆగిందని, తద్వారా భారతీయ విద్యార్థులను తరలించేందుకు వీలు కలిగిందని బీజేపీ నేతలు ప్రకటించారు. అయితే, భారత్-పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపివేసిన ఘనత తనదేనని ట్రంప్ ప్రకటించడంపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ పేలాయి. వీటిని లక్షల మంది షేర్ చేశారు కూడా. భారతదేశ విధానాలు, నిర్ణాయక స్వాతంత్ర్యంపై ప్రశ్నించే అవకాశాన్ని ఈ ఘటన విపక్షాలకు కల్పించింది మోదీ హయాంలో భారత్ విశ్వబంధుగా ఎదిగిందని బీజేపీ ప్రచారం చేసుకున్నప్పటికీ, ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత మోదీ మిత్రులు లేనివాడిగా, ఒంటరిగా కనిపించారు. పలు దేశాలు, కూటములు ఉగ్రదాడిని ఖండించి, భారతదేశానికి సంఘీభావం ప్రకటించాయి. కానీ, పాకిస్థాన్ పేరెత్తకుండా ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నట్టు ఆరోపించాయి. 2014 నుంచి ప్రధాని మోదీ 151 విదేశీ పర్యటనలు చేశారని, 72 దేశాలను సందర్శించారని, అమెరికాను పది సార్లు సందర్శించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. అయినప్పటికీ, మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం కారణంగా మన దేశం ఒంటరిగా మిగిలిపోయిందని ఖర్గే విమర్శించారు.

ట్రంప్ తన మిత్రుడని మోదీ గతంలో స్వయంగా ప్రకటించారు. మతపరమైన వివక్ష, మైనారిటీల అణచివేత లాంటి సున్నితమైన భారతదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో ట్రంప్ తక్కువగా జోక్యం చేసుకుంటారని కేంద్ర పాలకులు భావించారు. కానీ, అందుకు విరుద్ధంగా జాతీయ భద్రత, అంతర్జాతీయ వ్యవహారాల్లో వైఖరి వంటి ఎంతో ముఖ్యమైన విషయాల్లో మోదీని ట్రంప్ ఇరుకునపెట్టారు. ట్రంప్ ఉగ్రవాదానికి సహజ వ్యతిరేకి అని భారత హిందూ జాతీయవాదులు భావించారు. ట్రంప్ ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని చూసి వారు అలా భావించి ఉండొచ్చు. అయితే, ట్రంప్ మాత్రం భారత్‌కు కొరుకుడుపడని విధంగా పాకిస్థాన్‌కు ఎక్కువ విలువిచ్చారు. భారత ప్రధాన శత్రువు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌తో కలిసి ఆయన భోజనం కూడా చేశారు. అయితే, ఈ ఒంటరితనం కాలక్రమేణా మరింత స్పష్టమైంది. ఐరాస భద్రతా మండలి సభ్యులను ఒప్పించడానికి అఖిలపక్ష బృందాలను కేంద్రం పంపినప్పటికీ పాక్‌ను తాలిబన్ ఆంక్షల కమిటీ చైర్మన్, కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నిక కాకుండా ఆపడంలో భారత్ విఫలమైంది. పాకిస్థాన్‌ను ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం ఇస్తున్న దేశంగా ప్రపంచ ముందు ఒంటరిని చేయలేకపోయింది. బదులుగా భారతదేశమే ఒంటరిగా నిలిచినట్టు కనిపిస్తున్నది. భారత్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఐఎంఎఫ్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్‌ల నుంచి పాక్ భారీగా రుణాలను పొందింది. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నందుకు పాక్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒంటరిని చేయాలని భారత్ భావించింది. కానీ, వాస్తవానికి భారతే ఒంటరైంది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాల ఆంక్షలను ధిక్కరించడం వల్ల మొదలైన టారిఫ్ యుద్ధం మోదీ-ట్రంప్ బంధాన్ని మరింత సంక్లిష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆగస్టులో చైనాతో మోదీ స్నేహం చేయాల్సి వచ్చింది. అయితే, గత కొన్నేండ్లుగా భారత హిందూ జాతీయవాదులకు దేశీయ కథనాలు అల్లడంలో చైనాయే ప్రధాన ముడిసరుకుగా ఉన్న విషయం విదితమే. అమెరికా, చైనా వంటి ప్రపంచ శక్తులు మాత్రమే కాదు, ఇతర దేశాలు కూడా భారత్‌ను కాదని పాక్‌కు గట్టి మద్దతుగా నిలిచాయి. మోదీ ప్రభుత్వం ఎప్పటినుంచో చెప్తున్నట్టు గ్లోబల్ సౌత్ గొంతుకగా మారడంలో కూడా భారత్ విఫలమైంది. ఇజ్రాయెల్-గాజా యుద్ధం ప్రపంచ సమస్యగా మారుతున్న సమయంలో దృఢమైన పాలస్తీనా అనుకూల వైఖరి చైనా గ్లోబల్ సౌత్ గొంతుకగా మారడానికి దోహదపడింది. మరోవైపు భారతదేశం తన సాంప్రదాయ పాలస్తీనా అనుకూల వైఖరి నుంచి దూరం జరిగి ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలను నెరిపింది.

ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజాలెల్‌ను భారత్‌కు ఆహ్వానించడాన్ని సెప్టెంబర్ 9న కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ తీవ్రంగా ఖండించారు. బెజాలెల్‌ను రైట్ వింగ్ తీవ్రవాదిగా, ఇజ్రాయెల్ ఆక్రమణ, విస్తరణవాద ఎజెండాకు ప్రధాన కారకుడిగా విజయన్ వర్ణించారు. గాజాలో మారణహోమం జరుగుతున్న సమయంలో నెతన్యాహు సర్కారుతో ఒప్పందాలు కుదుర్చుకోవడం పాలస్తీనా పట్ల భారత చారిత్రక సంఘీభావానికి తీరని ద్రోహం చేయడమేనని విమర్శించారు. పాలస్తీనా సమస్యకు న్యాయమైన, శాశ్వత శాంతి మార్గం అన్వేషించకుండా ఇజ్రాయెల్‌తో సైనిక, భద్రత, ఆర్థిక సంబంధాలను కొనసాగించడం నీచమని దుయ్యబట్టారు. పశ్చిమ ఆసియాలోని ముస్లిం మెజారిటీ దేశాల పట్ల ఇజ్రాయెల్ వైఖరి భారత్-ఇజ్రాయెల్ దోస్తీకి ఒక కారణమని హిందూ జాతీయవాదులు అనుకోవచ్చు. కానీ, 21వ శతాబ్దంలోనే అత్యంత దారుణమైన మారణహోమం జరుగుతున్న సమయంలో ఆయుధాలు, సాంకేతిక ఒప్పందాలు చేసుకోవడమనేది అన్ని సిద్ధాంతాలను కాలరాయడమే. మోదీ ప్రభుత్వం విదేశాంగ విధాన ప్రాధాన్యాల్లో జాతీయ భద్రత, పొరుగు దేశాలకు అగ్ర పీఠం ఉంటుందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ గతంలో చెప్పారు. 2019 స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో మోదీ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చేవారిని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారిని, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసేవారిని ప్రపంచం ముందు దోషులుగా నిలబెట్టేందుకు భారత్ అన్ని శక్తులను ఏకం చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. సరిహద్దు భద్రత, ఉగ్రవాదంపై పోరు తమ సర్కారు తొలి ప్రాధాన్యమని కూడా అన్నారు. అయితే, వేగంగా మారుతున్న ఈ ప్రపంచంలో భారత శక్తిని మోదీ సర్కారు అతిగా అంచనా వేసిందా? అన్నది ఇక్కడ ప్రశ్న.

### 2025 నాటికి దక్షిణాసియాలో భారత ప్రభావం చాలా తగ్గిపోయింది.

షేక్ హసీనాకు భారత్ మద్దతివ్వడం, ఆమె భారత్‌లో ఏడాదిపాటు ఆశ్రయం పొందడం కారణంగా బంగ్లాదేశ్‌తో సంబంధాలు దాదాపుగా దిగజారాయి. మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే మణిపూర్, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాల్లో ఫ్రీ మూవ్‌మెంట్ రెజీమ్ (ఎఫ్ఎంఆర్)ను పరిమితం చేయడం, సరిహద్దు వెంబడి కంచె వేయడం, పౌరసత్వంపై విచారణలు వంటి విధానాల మూలంగా మయన్మార్‌తో సంబంధాలు సంక్లిష్టంగా మారాయి. మాల్దీవులు, శ్రీలంకల సంబంధాల విషయంలో భారత్‌కు చైనా తీవ్రంగా పోటీ ఇస్తున్నది. 2015లో రాజ్యాంగ సంక్షోభం తర్వాత నేపాల్‌తోనూ సంబంధాలు క్షీణించాయి. సరిహద్దు వివాదంతో పాటు ప్రపంచవ్యాప్తంగా చైనా ప్రభావం పెరుగుతున్న కారణంగా డ్రాగన్‌తో మళ్లీ మళ్లీ వివాదాలు తలెత్తుతున్నాయి. దక్షిణాసియాలో సమన్వయం కోసం సార్క్‌కు ప్రత్యామ్నాయంగా భారతదేశం సమర్థవంతమైన మరో కూటమిని నిర్మించలేకపోయింది. అయితే చైనా-పాక్-బంగ్లాదేశ్ కూటమిగా ఏర్పడుతున్న సంకేతాలు వెలువడుతున్నాయి. దక్షిణాసియా, మధ్య ఆసియా, ఆఫ్రికాలో చైనా విస్తరణకు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) సహాయపడుతున్నది. బ్రిక్స్‌లో చైనా ఆధిపత్య శక్తిగా ఉద్భవించింది. చైనాను ఎదుర్కొనేందుకు భారత్ చేసిన క్వాడ్ లాంటి ప్రయత్నాలు ఇంకా ఫలితాలివ్వలేదు. భారత్, ఇజ్రాయెల్, యూఏఈలతో కూడిన ఐ2యూ2 గ్రూప్‌పై సమయం, శక్తి, వనరులను ఇండియా పెట్టుబడిగా పెడుతున్నది. అయితే, ఆర్థిక, సాంకేతిక అంశాల్లో మాత్రమే సహకారం అందిస్తూ, భద్రతా సంబంధిత అంశాలను మినహాయించడం ద్వారా ఇది ప్రారంభమైంది. కరీబియన్ దేశాలతో సంబంధాలను మరింత పెంచుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్నది. అయితే 2025 సెప్టెంబర్‌లో చేపట్టిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ) వంటి భారత సొంత ప్రయత్నాలు చైనా బీఆర్ఐతో పోలిస్తే చాలా తక్కువనే చెప్పాలి. భారతీయులు తనకు మరో అవకాశమిచ్చారని, ఈ అవకాశం భారత్‌ను విశ్వగురును చేస్తుందని 2019 లోక్‌సభ విజయం తర్వాత గుజరాత్‌లో జరిగిన ఒక ర్యాలీలో మోదీ అన్నారు. క్రమంగా భారత్ తనను తాను విశ్వబంధుగా ప్రచారం చేసుకున్నది. 2023 స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంలో భారత్ గ్లోబల్ సౌత్ గొంతుకగా మారుతున్నదని మోదీ చెప్పారు. ఒక నెల తర్వాత 2023 సెప్టెంబర్ 18న మోదీ పార్లమెంట్‌లో భారతదేశం విశ్వబంధుగా స్థానం సంపాదించుకోవడం గర్వకారణమని, యావత్ ప్రపంచం భారతదేశాన్ని మిత్రుడిగా చూస్తున్నదని తనకు

### తానుగా కితాబిచ్చుకున్నారు.

నిస్సందేహంగా భారత్ జీ20 సదస్సుకు అధ్యక్షత వహించడం గుర్తించదగిన విజయమే. ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)ని శాశ్వత సభ్యుడిగా చేర్చడంతోపాటు గ్లోబల్ సౌత్ గొంతుకగా మారేందుకు భారత్ నిబద్ధతను ప్రదర్శించింది. అయితే, ఇజ్రాయెల్-గాజా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలు, గ్లోబల్ వార్మింగ్‌ను తీవ్రతరం చేసిన నష్టానికి పశ్చిమ దేశాలు ప్రపంచానికి పరిహారం ఇవ్వడానికి నిరాకరించడం వంటి కీలక అంశాల పట్ల ఎలాంటి వైఖరిని తీసుకోలేకపోవడం భారతదేశ 'విశ్వబంధు' బ్రాండింగ్‌కు ఏమాత్రం సరితూగలేదు. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం అంతర్జాతీయ మద్దతును కూడగట్టడంలో భారత్ విఫలమవడమూ ఆశ్చర్యం కలిగించలేదు.

# ఉల్లిపాయలను నేరుగా తినడం ఇష్టం లేదా..? అయితే వాటితో టీ ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



ఉల్లిపాయలను మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. ఉల్లిపాయలను మనం రోజూ కూరల్లో లేదా వివిధ రకాల వంటల్లో వేస్తుంటాం. దీని వల్ల వంటలకు చక్కని రుచి వస్తుంది. ఉల్లిపాయలను కొందరు రోజూ పచ్చిగానే తింటుంటారు. అయితే ఉల్లిపాయలు ఘాటుగా ఉంటాయి కనుక కొందరు పచ్చిగా తినేందుకు ఇష్టపడరు. పైగా ఉల్లిపాయలను తింటే నోరు వాసన వస్తుంది. కనుక ఉల్లిపాయలను తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే ఉల్లిపాయలతో టీ తయారు చేసి తాగవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. ఉల్లిపాయలను పచ్చిగా తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో, దీంతో టీ తయారు చేసి తాగినా కూడా అలాంటి లాభాలే కలుగుతాయి. పైగా ఘాటుదనం కాస్త తగ్గుతుంది. నోరు కూడా వాసన రాదు. కనుక ఉల్లిపాయల టీని ఎవరైనా సరే తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

### సీజనల్ వ్యాధులకు చెక్..

ఉల్లిపాయల టీని పలు సంప్రదాయ వైద్య విధానాల్లో ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇది గొంతు సమస్యలను తగ్గిస్తుంది. దగ్గు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఉల్లిపాయల్లో క్వర్సెటిన్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి ఇన్ ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాయి. దీంతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. దీంతో రోగాల నుంచి త్వరగా బయట పడవచ్చు.

### జీర్ణ వ్యవస్థకు..

ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది కనుక శరీరంలోని తీవ్రమైన వాపులు సైతం తగ్గిపోతాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల టీ సహజసిద్ధమైన ఎక్స్ పెక్టోరెంట్ గా పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. దీని వల్ల ఛాతి పట్టేయడం, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బ్రాంకైటిస్ తగ్గుతుంది. ఉల్లిపాయల టీ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అజీర్తిని తగ్గిస్తుంది. ఈ టీ ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది.

### ఎలా తయారు చేయాలి..?

బీపీ ఉన్నవారికి ఉల్లిపాయల టీ ఎంతో మేలు చేస్తుంది. ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇక ఉల్లిపాయల టీని ఎలా తయారు చేయాలో చూద్దాం. ఇందుకు గాను 1 మీడియం సైజ్ ఉల్లిపాయ, 2 నుంచి 3 కప్పుల నీళ్లు, కొన్ని అల్లం ముక్కలు, 2 టీస్పూన్ల తేనె, కొద్దిగా నిమ్మరసం తీసుకోవాలి. ఉల్లిపాయను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. పాత్రలో నీటిని పోసి అందులో ఉల్లిపాయ, అల్లం ముక్కలు వేసి నీటిని బాగా మరిగించాలి. స్టవ్‌ను సిమ్‌లో పెట్టి నీళ్లను 10 నుంచి 15 నిమిషాల పాటు మరిగించిన తరువాత ఆ నీళ్లను వడకట్టి అందులో తేనె, నిమ్మరసం కలపాలి. దీంతో ఉల్లిపాయల టీ రెడీ అవుతుంది. దీన్ని గోరు వెచ్చగా ఉన్నప్పుడు తాగేయాలి. ఈ టీని రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా చాలు, అనేక లాభాలు కలుగుతాయి.

# చార్యపాము చావలే!



పడగ నలిగింది కానీ
కర్ర విరగలే పాము చావలే
సరిహద్దుల ఆవల
వీలు చూసుకొని బుస కొడుతున్నది!
మన దురదృష్టమేమంటే
చిత్రమేమంటే పాములు పట్టేవాడు
పాము ఆడించినట్లు ఆడుతున్నాడు
ఇక్కడే పుటి ఇక్కడే పెరిగినా
ఈ మట్టి వాసన అతనికబ్బలే!
అతనిప్పుడు ఏమైనా కావచ్చు
అవకాశం వచ్చింది కదా అని
ప్రాంతాన్ని తల తాకట్టు పెడితే
చరిత్రహీనుల లిస్టులో చేరిపోతాడు!
అరుదైన అవకాశం దొరికినప్పుడైనా
చెట్టంత ఆదర్శంగా ఎదగాలి
పోరు నేలలో మొలకెత్తిన బిడ్డలు
ఎన్నడూ లొంగుబాటును సహించరు
ఈ రోజు నీ మాట చెల్లుబాటు కావచ్చు
చరిత్రకారులకు ఆధారాలతో చిక్కిపోతావు
పాము కుక్క ఎన్నటికీ ఒకటి కాదు
దానికి పగ తప్ప విశ్వాసం ఉండదు
నువ్వు ఎన్ని పాలు తాగించినా
నీవే కాదు ఎవరినైనా
కాటు వేయడం దాని సహజ లక్షణం!
ఇది నీకు పరీక్షా కాలం
నీవు నిటారుగా నిలబడని రోజు
జాతి మొత్తం దుమ్మెత్తి పోస్తుంది!!

# ఎండు మిర్చిని తినవచ్చా..? వీటితో ఎలాంటి లాభాలు కలుగుతాయి..? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?



ఎండు మిర్చిని మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. వీటితో కూరలు, పచ్చళ్లు చేస్తుంటారు. చారు, రసం వంటి వాటి తయారీలోనూ ఎండు మిర్చిని ఉపయోగిస్తారు. పులిహోరలో వేసే ఎండు మిర్చి ఎంతో రుచిగా ఉంటుంది. ఘాటు కావాలని కోరుకునే వారు ఎండు మిర్చిని ఎక్కువగా తింటుంటారు. ఎండు మిర్చి వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, రంగు, వాసన వస్తాయి. అయితే ఎండు మిర్చి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఎండు మిర్చిలో క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో, రోగాలను నయం చేయడంలో సహాయం చేస్తుంది. ఎండు మిర్చిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వీటిని తింటుంటే పలు వ్యాధులు నయం అవుతాయని అంటున్నారు.

### బరువు తగ్గేందుకు..

ఎండు మిర్చిలో అధికంగా ఉండే క్యాప్సెయిసిన్ కారణంగా బరువు తగ్గాలనుకునే వారికి ఎంతో మేలు చేస్తుంది. క్యాప్సెయిసిన్ వల్ల శరీరం వేడెక్కి మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు త్వరగా కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు వేగంగా తగ్గుతారు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువును తగ్గించుకోవాలని చూస్తున్నవారు ఎండు మిర్చిని తింటుంటే ప్రయోజనం ఉంటుంది. ఎండు మిర్చిలో ఉండే క్యాప్సెయిసిన్ కారణంగా నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. కనుక ఎండు మిర్చిని తింటే శరీరంలోని నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### కొలెస్ట్రాల్ స్థాయిలకు..

ఎండు మిర్చిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ట్రై గ్లిజరైడ్ స్థాయిలు తగ్గుతాయి. దీని వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. గుండె సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎండు మిర్చిలో విటమిన్ సి కూడా అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీని వల్ల ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ఎండు మిర్చిలో విటమిన్ సితోపాటు కెరోటినాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగానే ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రాణాంతక వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. ఎండు మిర్చిని తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల జీర్ణ రసాలు ఉత్పత్తి అవుతాయి. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది.

### జాగ్రత్తలు తప్పనిసరి..

100 గ్రాముల ఎండు మిర్చిలో 318 క్యాలరీల శక్తి ఉంటుంది. పిండి పదార్థాలు 57 గ్రాములు, ఫైబర్ 25 గ్రాములు, ప్రోటీన్లు 12 గ్రాములు, కొవ్వులు 17 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్లు సి, బి6, ఎలతోపాటు ఐరన్, పొటాషియం వంటి పోషకాలు కూడా అధిక మొత్తంలో ఉంటాయి.

# చూచిరాత.. మెదడుకు మేత!



చూచిరాత అనేది ఒకప్పుడు స్కూల్స్‌లో సర్వసాధారణ విషయం. రోజూ తెలుగు, ఇంగ్లిష్ అవసరమైతే హిందీ చూచిరాత పిల్లలకు హోమ్‌వర్క్‌లో భాగంగా ఉండేది. పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినా, క్లాస్ అల్లరి చేసినా ప్రశ్నలకు జవాబులను పదిసార్లో, ఇరవైసార్లో చూసి రాయమనడం శిక్షగా ఉండేది. ఇది తెలియకుండానే పిల్లలను పాఠాలు నేర్చుకునేటట్లు చేసేది. ఇప్పుడు పరిస్థితి మారింది. నోట్ పుస్తకాల స్థానంలో ఫోన్ నోట్స్, ట్యాబ్‌లు వచ్చేశాయి. పిల్లలు రోజూ కాపీ రైటింగ్ రాయడం అనేది తగ్గిపోయింది. దీని ప్రభావం పిల్లలు నేర్చుకోవడంపై పడుతున్నది. పెద్దల మాట చద్దన్నం మూట అన్నట్లుగానే చేత్తో రాయడం అనేది నేర్చుకునే ప్రక్రియను పరిపుష్టం చేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు, డిజిటల్ టెక్నాలజీతో అలవాటు పడిన ఈ రోజుల్లో చేతితో రాసే పద్ధతి పాతదిగా అనిపించవచ్చు. తరగతిలో నోట్స్ చేతితో రాసుకోవడం మంచిదని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. చిన్నపిల్లలకు చేతితో రాయడం నేర్పించడం చాలా అవసరం. ఇటీవల సైంటిస్టులు చేతితో రాయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అవి ఇలా ఉన్నాయి. గుర్తించడం సులభం.. ఫ్రాంటియర్స్ ఇన్ సైకాలజీలో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం విద్యార్థులు చేతితో నోట్స్ రాసుకున్నప్పుడు వారి మెదడులోని మోటార్, విజువల్, సెన్సరీ, మెమొరీకి సంబంధించిన భాగాలు ఎక్కువ పని చేస్తున్నాయి. మన చేతి వేళ్లు అక్షరాలను రాసేటప్పుడు మెదడులోని వివిధ భాగాలు చురుకుగా పనిచేస్తాయి. దీంతో అక్షరాలను గుర్తించడం, వాటిని గుర్తుపెట్టుకోవడం సులభం అవుతుంది. బుర్రలో కసరత్తు.. కంప్యూటర్‌లో టైప్ చేసేటప్పుడు, మనం కేవలం లెక్చరర్ చెప్పింది వినకుండా టైప్ చేస్తాం. అప్పుడు మనం విన్న సమాచారాన్ని మెదడులో ప్రాసెస్ చేయడం తక్కువగా ఉంటుంది. చేతితో రాసేటప్పుడు ప్రతి పదాన్ని రాయడం కష్టం. దానివల్ల మనం ముఖ్యమైన పాయింట్లను మాత్రమే ఎంచుకొని వాటిని మనకు ఇప్పటికే తెలిసిన విషయాలతో పోల్చి రాసుకుంటాం. ఇలా చేయడం వల్ల మనం కొత్త విషయాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతాం. వేళ్ల కదలిక.. చేతితో రాసేటప్పుడు, మన వేళ్లు అక్షరాలను రాసేటప్పుడు, ప్రతి అక్షరానికి ఒక ప్రత్యేకమైన కదలిక అవసరం.

# దగ్గు, జలుబుతో అవస్థ పడుతున్నారా..? అయితే ఈ సహజసిద్ధమైన ఇంటి చిట్కాలను పాటించండి..!



దగ్గు, జలుబు అనేవి సీజన్లు మారినప్పుడల్లా మనకు వస్తూనే ఉంటాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సీజన్లు మారకున్నా తరచూ ఈ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటారు. వాతావరణంలో వచ్చే మార్పులతోపాటు కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా దగ్గు, జలుబు సమస్యలు మనల్ని అవస్థలకు గురి చేస్తుంటాయి. అయితే ఈ సమస్యలకు చాలా మంది ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. కానీ ఇంగ్లిష్ మెడిసిన్‌ను తరచూ వాడడం వల్ల దీర్ఘకాలంలో అనేక సమస్యలు వస్తాయి. అనేక సైడ్ ఎఫెక్ట్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీంతో పలు వ్యాధులు సైతం వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక ఇంగ్లిష్ మెడిసిన్‌ను ఎక్కువగా వాడకూడదు. మరి ఆయా సమస్యల నుంచి ఎలా బయట పడాలి అని చాలా మందికి సందేహం వస్తుంటుంది. కానీ అందుకు ఆయుర్వేదంలో చక్కని పరిష్కారాలు ఉన్నాయి. పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల ఆయా సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు. పైగా వాటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. ఇక ఆ ఇంటి చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### హెర్బల్ టీలు..

దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నప్పుడు రోజూ 2 లేదా 3 సార్లు హెర్బల్ టీలను సేవిస్తుండాలి. అల్లం, తులసి, కమోమిల్, పెప్పర్‌మింట్ వంటి హెర్బల్ టీలు ఆయా సమస్యల నుంచి త్వరగా బయట పడేలా చేస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఇన్ ఫెక్షన్లను త్వరగా తగ్గిస్తాయి. దీంతో దగ్గు, జలుబుతోపాటు ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వేడి వేడి చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను తాగుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని వల్ల కఫం త్వరగా కరిగిపోతుంది. దగ్గు, జలుబు తగ్గుతాయి. ఇక ఈ సమస్యలను తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక టీస్పూన్ తేనెను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు 2 సార్లు లేదా 3 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. అవసరం అయితే అందులో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు.

### అల్లం, వెల్లుల్లి..

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. వికారం నుంచి బయట పడేలా చేస్తాయి. వైరస్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అల్లంను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. లేదా నేరుగా ఒక టీస్పూన్ అల్లం రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 లేదా 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. ఇక వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇందుకు గాను 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని కాస్త నలిపి అందులో కాస్త తేనె కలిపి నేరుగా అలాగే తినేయాలి. లేదా వెల్లుల్లి రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే ఉపయోగం ఉంటుంది.

### పసుపు, మిరియాలు..

పసుపు, మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడిలలో దేన్నయినా సరే పాలలో కలిపి తీసుకుంటే ఉపయోగం ఉంటుంది. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ పండ్లను తేనెతో కలిపి తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఇలా ఆయా ఇంటి చిట్కాలను పాటిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పైగా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

# డార్క్ చాక్లెట్.. కొంచెంగా తిందాం!



చాక్లెట్ అనగానే నోటిని తీపి చేసే పదార్థమే అనుకుంటాం. కానీ, ఆ తీపిలోనే చేదు ఉంటుంది. నిజానికి చేదు కూడా మనిషి ఆరోగ్యానికి మంచే చేస్తుంది కదా. అలా ఈ డార్క్ చాక్లెట్ కూడా ఆనందాన్ని పంచడమే కాకుండా ఆరోగ్యాన్నీ కాపాడుతుంది. మరి ఈ డార్క్ చాక్లెట్.. బ్రైట్ సీక్రెట్స్ తెలుసుకుందామా.. డార్క్ చాక్లెట్‌ను 60–90 శాతం కొకోవా పౌడర్, తక్కువ మోతాదులో చక్కెర కలిపి తయారు చేస్తారు. కానీ, వైట్ (మిల్క్) చాక్లెట్ కంటే ఇందులో తక్కువ చక్కెర ఉంటుంది. వీటిలో ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి.

### ఆరోగ్య ప్రయోజనాలు

డార్క్ చాక్లెట్లోని ఫ్లేవనాయిడ్స్ గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఇవి రక్తపోటు తగ్గించడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఈ చాక్లెట్ చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఈ డార్క్ చాక్లెట్స్ న్యూరోప్లాస్టిసిటీని ప్రోత్సహించడం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. అలాగే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. డార్క్ చాక్లెట్స్ ఒత్తిడి హార్మోనైన కార్టిసోల్ స్థాయులను తగ్గిస్తాయి. అలాగే వీటిని తినడంవల్ల ఎండార్ఫిన్స్, సెరోటోనిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదల అవుతాయి. కొకోవాలోని ఎపికాటెచిన్ అనే పదార్థం.. శరీరం ఇన్సులిన్‌ను మరింత ఎక్కువగా ఉపయోగించుకునేలా చేస్తుంది. చాక్లెట్ తినని వారితో పోలిస్తే, వారానికి కనీసం 140 గ్రాముల డార్క్ చాక్లెట్ తినేవారికి మధుమేహం వచ్చే ప్రమాదం 21శాతం తక్కువని హార్వర్డ్ హెల్త్ పబ్లిషింగ్ అధ్యయనంలో తేలింది. డార్క్ చాక్లెట్స్‌లోని థియోబ్రొమైన్ అనే పదార్థం దంతాలకు రక్షణగా నిలుస్తుంది. అలాగే వీటిలో మెగ్నీషియం, ఐరన్, జింక్, క్యాల్షియం ఉండటంతో, ఎముకల బలానికి తోడ్పడతాయి.

### అపోహలు

**చక్కెర ఉండదు:** తప్పు.. డార్క్ చాక్లెట్స్‌లో చక్కెర ఉంటుంది. కానీ, మిల్క్ చాక్లెట్ కంటే తక్కువ మోతాదులో ఉపయోగిస్తారు.

**అన్నీ ఆరోగ్యకరమే:** కాదు.. 70 శాతానికి పైగా కొకోవా ఉన్న డార్క్ చాక్లెట్లే మంచివి. మార్కెట్లో దొరికే చాలా చాక్లెట్లలో అధిక మోతాదులో చక్కెర కలుపుతున్నారు.

**కెఫిన్ ఉండదు:** అవాస్తవం.. డార్క్ చాక్లెట్లలో కెఫిన్ ఉంటుంది. కాకపోతే కాఫీ కంటే తక్కువగా ఉంటుంది.

**పండ్లకు ప్రత్యామ్నాయం:** అబద్ధం.. ఇందులో యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నా, ఇవి సమతుల్యమైన ఆహారాన్ని భర్తీ చేయలేవు.

ప్రపంచ వ్యాప్తంగా పాపులరే

**మెక్సికో:** మెక్సికో చుట్టుపక్కల ఉండే కొన్ని తెగల ప్రజలు కొకోవాను దేవుని వరంగా భావిస్తారు. వారు నిర్వహించే పూజల్లో కొకోవాను వినియోగించేవారట.

**ఘనా–ఐవరీ కోస్ట్:** ఈ రెండు దేశాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద కొకోవా ఉత్పత్తిదారులు ఉన్నారు. ప్రపంచ అవసరాల్లో 60 శాతం కొకోవా సరఫరా ఇక్కడి నుంచే జరుగుతుంది.

# మట్టి పరిమళం జాతి జీవనం



తెలంగాణ ఆత్మగౌరవ పతాక అయిన బతుకమ్మ పండుగ వస్తుందంటేనే ఊరూ వాడల్లో కొత్త ఉత్సాహం మొదలవుతుంది. తెలంగాణ జన జీవనంలో అంతర్భాగమై ఆనందాలను, ఆత్మీయతలను మూటగట్టుకొని వచ్చే ఈ పూల పండుగ ప్రపంచంలో మరెక్కడా లేదు. అయితే, ఈ పండుగను పోలిన పండుగలున్నాయి. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ వ్యవసాయానికి పర్యావరణానికి సంబంధించినది కూడా. ఏటా మహాలయ అమావాస్య (పితృ అమావాస్య/ పెత్రమాస) నుంచి తొమ్మిది రోజుల ఆటపాటలు, చప్పట్ల ముచ్చట్ల కోలాహలంతో సాగే ఈ సామూహిక ఉత్సవం మహిళా సమైక్యతకు నిదర్శనం. మన సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగకు ముందు తొమ్మిది రోజులు బొడ్డెమ్మ పండుగను జరుపుకొంటారు. బతుకమ్మ పండుగకు సంబంధించి రకరకాల కథలున్నాయి. ఆడపిల్లను గౌరీదేవిగా భావించి గౌరవించి, పూజించడమే కుటుంబసభ్యులంతా బంధుమిత్రులతో కూడి ఉల్లాసంగా జరుపుకొనే పండుగ సంబురం ఇది. ఇక ఆ తొమ్మిది రోజులు బాలికలు,మహిళలు ఉన్నంతలో తయారై సాయంత్రం పూట ముందుగా ఇంటిముందు (ఇంటిలో) శుభ్రం చేసి ముగ్గువేసిన ప్రదేశంలో బతుకమ్మను పెట్టి ఆటపాటలతో వాటిచుట్టూ మూడుసాట్లర్లైనా తిరిగి వాటిని పట్టుకొని (నెత్తిన పెట్టుకొని) చెరువు గట్టు, గుడి ఆవరణ లాంటి నిర్ణీత ప్రదేశానికి వెళ్లి ఎత్తిన బతుకమ్మలను అక్కడ దించుతారు. ఇక్కడ ఆటతో పాటు పాట కూడా ప్రధానం. ఈ పాటల్లో బతుకమ్మకు సంబంధించి పౌరాణిక, చారిత్రక, జానపద, సామాజిక గాథలెన్నో చెప్పబడుతాయి. మౌఖిక సాహిత్యం నుంచి పుట్టిన ఈ పాటల్లో వావి వరుసలు, పుట్టింటి, అత్తింటి సంబంధాలు, జీవన విధానాలు, భక్తి భావనలు, స్త్రీల కష్టాలు, కన్నీళ్లు, కుటంబ బంధాలు, అప్పగింతలు, సంవాదాలు, కర్తవ్యాలు మొదలైన అంశాలెన్నింటితోనో అల్లబడిన విషయాలు అర్థమవుతాయి, ఆలోచింపజేస్తాయి. గొంతులు కలిపి ఆయా పాటలను పాడుకోవడం సంతోషానికే కాదు, జ్ఞాపకశక్తికి కూడా నిదర్శనం. పాటలు పాడుకుంటూ బతుకమ్మ ఆడుకుంటే ఆ ఆనందమే వేరు. ఆ పాటలన్నింటినీ సేకరించి నిక్షిప్తం చేసుకోవలసిన బాధ్యత మనపై ఉన్నది. అట్లాంటి పాటల్లో కొన్ని 'శ్రీలక్ష్మీదేవి ఉయ్యాలో/ సృష్టి బతుకమ్మయ్యె ఉయ్యాలో/ ధర చోళ దేశమున ఉయ్యాలో/ ధర్మాంగుడను రాజు ఉయ్యాలో' అని చెప్తూ చివరలో 'జగతిపై బతుకమ్మ ఉయ్యాలో/ శాశ్వతంబుగ నిలిచె ఉయ్యాలో' అంటూ ఆ కథను చెప్తారు.

'రామ రామ రామ ఉయ్యాలో/ రామనే శ్రీరామ ఉయ్యాలో/ రామ రామనంది ఉయ్యాలో రాగమెత్తరాదు ఉయ్యాలో' అంటూ కుటుంబ బంధాలను తెలుపుతూ అన్ని పూలను తేవడంతో పాటు 'పోయిరా బతుకమ్మ ఉయ్యాలో/ మళ్లొచ్చే ఏడాదికి ఉయ్యాలో' అని పూర్తవుతుంది. 'కలవారి కోడలు ఉయ్యాలో/ కనకమహాలక్ష్మి ఉయ్యాలో' అని మొదలై అత్తింట సమిష్టి కుటుంబంలో ఉన్న అమ్మాయి తనను తీసుకెళ్లడానికి వచ్చిన అన్నతో పుట్టింటికి వెళ్లడానికి కుటుంబంలో అందరి అనుమతి తీసుకోవడం, చివరగా భర్త అనుమతించి 'కట్టుకో చీరెలూ ఉయ్యాలో/ పెట్టుకో సొమ్ములు ఉయ్యాలో' అని చెప్పడం తో పూర్తవుతుంది. అయితే బతుకమ్మ ఆటను ముందుగా పూల పాట ఆడే 'ఒక్కేసి పువ్వేసి చందమామ/ ఒక్క జామాయె చందమామ' అని, 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ/ ఏమేమి కాయొప్పునే' అని తర్వాత 'ఒక్కేసి వెలగపండే గౌరమ్మ/ దూరాన దోరపండే' అంటూ పండ్లకు సంబంధించి, 'ఒక్కొక్క అక్షింతలూ గౌరమ్మ/ ఒక్క మల్లెసాలలూ గౌరమ్మ' అంటూ అక్షింతలకు సంబంధించిన పాటలతో ప్రారంభిస్తారని మా పెద్దలు చెప్పేవాళ్లు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, సరదా సందడితో సాగే సందర్భంలో 6వ రోజు 'అర్రెం' అని (బహు శా విశ్రాంతి కోసం అయ్యుంటుంది) ఆడరు. 9వ రోజు తీరొక్క పూలతో, చీరెసారెలతో తీర్చిదిద్దిన సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకొంటారు. ఈ తొమ్మిది రోజులూ పండ్లతో పాటు రకరకాల పదార్థాలతో చేసిన వంటకాలను, పల్లీలు నువ్వులు, పెసలు మొదలైన కొత్త పంటల ధాన్యాలను పొడులుగా కొట్టి బెల్లంతో కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు. వీటినే సత్తుపిండి అని కూడా అంటారు. ఇక చివరి ఘట్టంగా బతుకమ్మపై భాగాన ఉన్న గౌరమ్మను తీసి బతుకమ్మ కుదురును జాగ్రత్తగా నీటిలో జార విడుస్తారు. అక్కడ పళ్లెంలో తెచ్చిన కొన్ని నీళ్లలో గౌరమ్మ నుంచి మరొక పళ్ళెంతో దానిని మూసి 'హిమవంతునింట్లో పుట్టి / హిమవంతునింట్లో పెరిగి' అంటూ ఊయలలూపుతూ చివరలో 'మాయమ్మ గౌరీదేవి పోయిరావమ్మా/ మాయమ్మా లక్ష్మీదేవి మళ్ళీ రావమ్మా' అని, 'ఉసికలో పుట్టిన గౌరమ్మ/ ఉసికల పెరిగిన గౌరమ్మ/ ఉసికిల వసంతమాడంగ' అంటూ పసుపు, కుంకుమ, అక్షింతలను కూడా ఆ పాటలో పదాలుగా చేర్చి చివరలో 'పోయిరా గౌరమ్మా పోయిరావమ్మా' అంటూ ఓలలాడిస్తారు. తర్వాత ఆ పసుపును, ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. నైవేద్యాలను అందరికీ పంచుతారు. అయితే, ఈ బతుకమ్మ సంబురాల్లో పూల సేకరణ, బతుకమ్మ అమరిక, ప్రసాదాల తయారీ, బతుకమ్మలను నిర్ణీత ప్రదేశాలకు చేర్చడం, ఆటపాటలప్పుడు పిల్లలను చూసుకోవడం, నిమజ్జనం లాంటి విషయాల్లో మగవాళ్ళ భాగస్వామ్యం కూడా ఉంటుంది. అందుకే, ఇది కుటుంబ బంధాలను పెనవేసే పండుగ.

మన తాత్విక ఆచరణలను గుర్తుచేసే ఈ సామాజిక సందర్భంలో పళ్ళు అత్తగారింటికి పోయిన బిడ్డలను పుట్టింటికి పిలిచి వాళ్ళను చీరెలు సారెలతో సత్కరించి పంపించడం ఒక సంప్రదాయం. ఇట్లా తెలంగాణకు శిఖరాయమైన మట్టి పండుగ, చెట్టు పండుగ, నీటి పండుగ, రుచుల పండుగ, ఎన్నింటినో తెలుసుకొని, తలచుకొని మురిసిపోయే పండుగ అయిన ఈ బతుకమ్మ పండుగలో ఔషధ గుణాలు, చికిత్స లక్షణాలు ఇమిడి ఉన్నాయి. అందుకే ఈ పండుగ పూల జాతరై సాంస్కృతిక వారసత్వంగా కొనసాగుతున్నది. నాడు పల్లెలకు మాత్రమే పరిమితమైన బతుకమ్మ పండుగ తర్వాతి కాలంలో పట్టణాలకు, నగరాలకు, విదేశాలకు కూడా విస్తరించింది. భిన్న, ఆచార సంప్రదాయాలన్నీ గేటెడ్ కమ్యూనిటీల్లోనూ తెలంగాణ అస్తిత్వ గుర్తింపులో బతుకమ్మ భాగమవుతున్నది. ఎక్కడున్నా ఆధునిక పోకడలతో కృత్రిమత్వానికి తావివ్వకుండా సహజసిద్ధమైన వాతావరణంలో అర్థవంతంగా, ఆత్మీయబంధాలు పెనవేసుకునే విధంగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం మనందరి బాధ్యతగా భావించాలి. అప్పుడే బతుకమ్మ ఒక వేడుకనే కాదు, మట్టి పరిమళం, జాతి జీవనం అనే సందేశం భావితరాలకు అందుతుంది. ఈ సంస్కృతీ సంప్రదాయం కొనసాగుతుంది.

'గుమ్మడి పూలు పూయగ బ్రతుకు
తంగెడు పసిడి చిందగ బ్రతుకు
గునుగు తురాయి కులుకగ బ్రతుకు
బతికి బ్రతికి బతుకుల బతికిస్తూ
బతుకమ్మా! బ్రతుకు'
–ప్రజాకవి కాళోజీ

# అరటి పువ్వును తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..? తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!



అరటి పండ్లను తినడం వల్ల ఎన్ని ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. చాలా తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు. కనుక అరటి పండ్లను చాలా మంది తింటుంటారు. అయితే కేవలం అరటి పండ్లే కాదు, అరటి పువ్వులు కూడా మనకు మేలు చేస్తాయి. అరటి పువ్వులను కూరగా చేసుకుని తినవచ్చు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది. మన దేశంతోపాటు పలు ఆసియా దేశాలకు చెందిన వారు అరటి పువ్వును కూడా వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. అలాగే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అరటి పువ్వులో అనేక విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మనల్ని రోగాల నుంచి రక్షిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

### బరువు తగ్గేందుకు..

అరటి పువ్వులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకం తగ్గేలా చేస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. అరటి పువ్వులో ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, టానిన్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ ను తొలగిస్తాయి. దీని వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అరటి పువ్వులో పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీపీని నియంత్రిస్తాయి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది.

### షుగర్ లెవల్స్‌కు..

అరటి పువ్వు గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. కనుక దీన్ని తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. పైగా ఈ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ వల్ల ఇన్సులిన్‌ను శరీరం మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అరటి పువ్వులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. దీని వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. మహిళలు రుతు సమయంలో ఈ పువ్వులను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ పువ్వులను తినడం వల్ల అతిగా రక్తస్రావం జరగకుండా అడ్డుకోవచ్చు. కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. నెలసరి సక్రమంగా వస్తుంది. రుతు సమస్యలు తొలగిపోతాయి.

### రక్తహీనత తగ్గేందుకు..

అరటి పువ్వును తింటే బాలింతల్లో పాలు బాగా పడతాయి. ఈ పువ్వుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. కనుక ఈ పువ్వులను తింటే హిమోగ్లోబిన్ ఉత్పత్తి అవుతుంది. ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. దీంతో రక్తహీనత తగ్గుతుంది. నీరసం, అలసట నుంచి బయట పడవచ్చు. అరటి పువ్వును కూరగా లేదా పచ్చడి రూపంలో తయారు చేసి తినవచ్చు. దీన్ని సలాడ్స్‌లోనూ వేసుకోవచ్చు. దీంతో సూప్‌లను కూడా తయారు చేసి తింటారు. ఇలా అరటి పువ్వును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# భారత్ విద్యార్థులు గుడ్డిగా కెరీర్ ఎంపిక.. 90 శాతం మంది స్టూడెంట్స్‌కు సరైన మార్గదర్శకత్వం కరువు




## ఐరాస తాజా అధ్యయనం వెల్లడి

## కెరీర్ కౌన్సెలింగ్‌తోనే పరిష్కారం

భారత్‌లో కెరీర్ కౌన్సెలింగ్ లేకపోవడం (Career Counselling) పెద్ద సమస్యగా మారిందని ఐక్యరాజ్య సమితి తాజా అధ్యయనం తేల్చింది. దాని ప్రకారం కేవలం 10 శాతం విద్యార్థులకు మాత్రమే కెరీర్‌కు సంబంధించిన సలహాలు లభిస్తున్నాయి లేదా దాని గురించి వారికి అవగాహన ఉంది. మిగతా 90 శాతం మంది కుటుంబ సభ్యుల సలహాలు, సామాజిక ఒత్తిడులు, 'సురక్షితమైన' ఉద్యోగాల ఆకర్షణలో పడిపోయి సరైన కెరీర్ ఎంపిక చేసుకోవడం లేదు. ఏడు రాష్ట్రాల్లో 9–12 తరగతులు చదువుతున్న 21,239 మంది విద్యార్థులను సర్వే చేసి ఐరాస ఈ అధ్యయనాన్ని వెలువరించింది.

### 10 శాతం విద్యార్థులకు మాత్రమే

గాలప్ 2024 గ్లోబల్ వర్క్ ప్లేస్ రిపోర్ట్ ప్రకారం కేవలం 14 శాతం భారతీయ ఉద్యోగులు మాత్రమే తాము కెరీర్‌లో అభివృద్ధి చెందుతున్నట్టు భావిస్తున్నారు. వ్యక్తిగత ఆసక్తులు, నైపుణ్యాలతో సంబంధం లేకుండా కెరీర్‌ను ఎంపిక చేసుకోవడం వల్ల ఈ అంతరం ఏర్పడిందని.. దీని వల్ల ఉద్యోగ అసంతృప్తి విస్తృతంగా వ్యాపించిందని నిపుణులు తెలిపారు. 10 శాతం మంది విద్యార్థులకు మాత్రమే తమ కోర్సుల ఫీజు, ఎంపికలు, విద్యా సంస్థలు, అవకాశాల గురించి తెలుసు. ప్రభుత్వ స్కూళ్లలో కెరీర్ కౌన్సెలింగ్ లభించడం లేదు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో అదొక ఖరీదైన వ్యవహారంగా ఉంది. భారత్‌లో చాలాచోట్ల వేలాది మంది విద్యార్థులకు ఒక కెరీర్ కౌన్సిలర్ కూడా ఉండటం లేదు. తల్లిదండ్రులు ఇంకా ఇంజినీరింగ్, వైద్య విద్య, సివిల్ సర్వీసెస్‌లను ఎంపిక చేసుకోవాలని పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. కెరీర్ కౌన్సెలింగ్ అంతరాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే కెరీర్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా, స్థానిక భాషల్లోని మొబైల్ అప్లికేషన్ల ద్వారా, ఆన్‌లైన్ మెంటార్‌షిప్ నెట్‌వర్క్‌ల ద్వారా కొంత మేరకు భర్తీ చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

